

అమ్మ చెక్కిన చందన శిల్పం



రచన, సంకలనం

కొండముది దత్తాత్రేయ శర్మ



అమ్మ ఆంతరంగిక మంధిరంలో అమ్మతో అమ్మ ఆంతరంగిక కార్యదర్శి కొండముది రామకృష్ణ

అమ్మ చెక్కిన చందనశిల్పం

రచన, సంకలనం
కొండముది దత్తాత్రేయశర్మ
సీనియర్ జర్నలిస్ట్

ప్రచురణ
శ్రీ కొండముది రామకృష్ణ ఫౌండేషన్
జిల్లెళ్ళమూడి - 522 113

అమ్మ చెక్కిన చందన శిల్పం

May, 1999

Rs. 25/-

D.T.P. Type Setting & Printed by
SRI RAGHAVENDRA GRAPHIX
Arundelpet, GUNTUR - 2
Phone : 204899

తొలిపలుకులు

స్మృతి రేఖలు

''అసలే ఆనదు చూపు, ఆ పైన ఈ కన్నీరు ''

ఈ అక్షరాలు కాగితంమీద పెడుతుంటే కన్నీళ్ళు ధారగా కురుస్తున్నాయి. రామకృష్ణ అన్నయ్య జీవితం సఫలం, త్యాగమయం, ప్రేమపూరితం. ఆ మహోదాత్త వ్యక్తిత్వాన్ని అక్షరబద్ధం చేయటం అసాధ్యం, అనితరసాధ్యం.

రామకృష్ణ అన్నయ్య షష్టి పూర్తిని జిల్లెళ్ళమూడిలో వైభవంగాజరపాలని శ్రీ విశ్వజననీపరిషత్ నిర్ణయించినపుడు, అన్నయ్య సమగ్ర జీవిత చిత్రణ చిన్న పుస్తకరూపంలో వెలువరించాలని కార్యవర్గం భావించింది. ఆ పనికి నన్ను నియోగించి నాపైన ఒక గురుతర భారం మోపింది. అన్నయ్యతో నాకు గల అనుబంధం వల్లనో, మరే కారణం చేతనో ఈజీవితచరిత్ర రచనాబాధ్యత నాకు అప్పగించారు. నేను అప్పుడే ''ఆంధ్రప్రభ''లో పదవీ విరమణ చేసి ''విస్డమ్''సహాయసంపాదక బాధ్యతలు నిర్వహిస్తున్నాను. ఈ జీవిత చరిత్ర రచన క్లిష్టమైన కార్యమే అయినా ఇది ఒక భగవదాదేశంగా తలదాల్చి మద్రాసులో సుప్రసిద్ధమైన కన్నెమెరా గ్రంథాలయంలో రోజుల తరబడి ఇతరుల జీవితచరిత్రలు అధ్యయనం చేసి కొత్తపంథాలో అన్నయ్య జీవితాన్ని రేఖాచిత్రణగా 15 అధ్యాయాలలో వ్రాసిముగించాను. అనివార్య కారణాలవల్ల అన్నయ్య షష్టి పూర్తి అనుకున్న విధంగా జరగలేదు. దీని ముద్రణ కూడ ఆలస్యమైంది. ఇంతలో అన్నయ్య పరమపదం అలంకరించాడు. ఆ విషాదఘట్టం కూడా దీనిలో చేర్చటం జరిగింది.

అనంతమైన సేవారంగంలో కాలుమోపి నిరంతర శ్రమతో దిగంత పరివ్యాప్తమైన యశస్సునార్జించి, మహోన్నత కీర్తి శిఖరాలను అధిష్టించిన వ్యక్తి అన్నయ్య. జిల్లెళ్ళమూడి సంస్థలకు పట్టుగొమ్మగా, అన సూయామహామాతృదేవికి అనుంగు పుత్రుడుగా రాసిలో, వాసిలో మిన్నగా నిల్చిన, అనేక కార్యక్రమాల సంధాతగా నిల్చిన అన్నయ్య జీవితాన్ని రేఖా మాత్రంగా స్పృశించటం మినహా నేను చేసిందేమీ లేదు. నాటి పరిషత్ అధ్యక్షులు శ్రీరావినూతల రామ చంద్రరావు, శ్రీ బూదరాజు శేషగిరిరావుగారల ఆజ్ఞను ఔదలదాల్చి అమ్మ ఆశీస్సులతో ఈ కార్యాన్ని పూర్తి చేసి మీ కరకమలాలకు అందచేస్తున్నాను స్వీకరించండి.

రామకృష్ణ అన్నయ్య జీవితంలోని ప్రధాన ఘట్టాలు కన్నంత, విన్నంత నా శక్తి మేరకు వ్రాశాను. అయితే అన్నయ్య అమ్మ సాన్నిధ్యంలో పొందిన అనుభవాలు, అనుభూతులు, అధ్యాత్మిక పరివర్తన నాలేఖినికి అంద(లే)క అసమగ్రంగా ముగించటం జరిగిందనే నిరాశ నాలో లేకపోలేదు. ఉత్తరోత్రా అన్నయ్య ఆధ్యాత్మిక జీవితాన్ని ఆ కోణంలో సమగ్రసుందరంగా ఎవరైనా వ్రాస్తే బాగుంటుందనే కోరిక నాలో మిగిలి పోయింది. ''కాలో హ్యయం నిరవధ్విపులాచ పృధ్వీ'' అన్నారు కదా పెద్దలు. ''మణి కిరీటము లేని మహరాజు'' ''రత్నపీఠిక లేని రారాజు'' మన రామకృష్ణ అన్నయ్య. మానవతను పెంచి, మంచి తనాన్ని విరియించి త్యాగానికీ, శౌర్యానికీ, సాహసానికీ, సమర్ధతకూ, సౌజన్యానికీ, సౌకుమార్యానికీ పెట్టిన మరో పేరుగానిల్చి, దయా, జాలీ, కరుణా అంతరంగాలలో నిండాలని, అభిమానం, ఆప్యాయతా, సదవగాహన సంయమనం వెల్లి విరియాలని కోరుకుని, నీతి నిజాయితీలకు మానవతా విలువలకు మరుపురాని ప్రతీకగా తన్ను తాను సమర్పించుకుని శిబిదధీచుల సోదరుడై, కొండముది వంశమణి దీపమై, జాతి జయస్తంభమై నిల్చిన రామకృష్ణ అన్నయ్యకిది నా అక్షర నివాళి. నా వినయపూర్వక కైమోడ్పు.

అన్నా! సాహిత్యసుధాధారలను జీవన వీణియపై మ్రోయించి యశోధనుడవై నిలిచి, రసమయ జగత్తును పులకింపచేసిన సురభిళ ప్రసూనవాసనలు ఇంకా మా నాసికల్లో గుభాళిస్తూనే ఉన్నాయి. ఆయా పాత్రలు చిరమై స్థిరమై నిల్చి మా మనోమందిరాల్లో యింకా ప్రతిబింబిస్తూనే ఉన్నాయి. ''చంద్రుని కోనూలు పోగు'' రీతిగా ఈ చిన్న పుస్తకం మీ విద్యాభిలాషకూ, అభ్యుదయ దృష్టికీ, నిస్స్వార్ధ సేవానిరతికీ అభినందన చందనంగా సమర్పిస్తున్నాను.

ఈ పుస్తకరచనలో ప్రచురణలో సహకరించిన సోదర సోదరీమణులకు నాకృతజ్ఞతాభివందనాలు తెలియ జేసుకుంటున్నాను. అచంచల కర్తవ్య దీక్షతో ముద్రణ పూర్తి చేసిన అనుజుడు కొండముది హనుమంతరావుకు ఋణ పడ్డాను. ప్రతి అధ్యాయం ప్రథమంలో, చివరిలో పొందుపర్చిన సుభాషితాలు వివిధ రచనల నుండి స్వీకరించినవి. ఆ మహామహులందరికి ధన్యవాదాలు. సర్వాంగ సుందరంగా ముద్రించి ఇచ్చిన ... ప్రెస్ వారికి నమస్కారములు.

మహాకవి దేవులపల్లి పలుకులతో ఈ స్మృతి రేఖలు ముగిస్తాను.

''సడి సేయకో గాలి సడిసేయ బోకే
బడలి ఒడిలో రాజు పవ్వళించేనే
రత్న పీఠిక లేని రారాజు నా స్వామి
మణికిరీటము లేని మహరాజుగా కేమి
పండు వెన్నెల నడిగి పాన్పు తేరాదే
నీలిమబ్బుల దాగు నిదుర తేరాదే
విమల వీవనపూని విసిరి పోరాదే''

''జయన్తిత్ సుకృతిసో
రససిద్ధాః కవీశ్వరా ''

బాపట్ల
22-3-99

వినీతుడు
కొండముది దత్తు
రచయిత, సంకలన కర్త

మనవి

అన్నయ్య జీవితం అనేక మంది వ్యక్తులతో ముడిపడి ఉండటంతో నాస్మృతిపథంలో మెరిసిన కొన్ని పేర్లు మాత్రమే దీనిలో పొందు పర్చటం జరిగింది. చాలా మంది సన్నిహితుల, హితుల పేర్లు వ్రాయలేక పోవటానికి కారణం నాకు అందు బాటులోకి రాక పోవటం, జ్ఞాపకం లేక పోవటమే. దీనికి రచయితగా క్షంతవ్యుణ్ణి.

ఈ పుస్తక ప్రచురణకు అహరహం తపన పడిన చిరంజీవి కొండముది సుబ్బారావు (మేనేజర్, చైతన్య గ్రామీణ బ్యాంక్) కు అమ్మ - అన్న ఆశీస్సులు అందుగాక?

- రచయిత

" నా మానస రాజహంస

నడచి వచ్చె నిదిగో

కృష్ణా నీ పదపంకజ

పంజరమున కిపుడె "

\- రచయిత

విషయ సూచిక

1 నివేదన

అమ్మ పేరు ''ఆధారం'', అన్న పేరు ''అవకాశం''.....

అమ్మ పేరు ''వెన్నెలా'', అన్న పేరు ''వెలుతురూ''.....

అమ్మది మమతల గర్భగుడి.....

అన్నది... సమతా మమతా మానవతా త్రివేణి సంగమ స్థలి....

అమ్మ... నిఖిల రసామృత మూర్తి ! కారుణ్యామృత వర్షిణి

అన్న... అనురాగ రాగ స్రవంతి ! రాగజలధి

అమ్మ... దివి నుండి భువికి దిగిన దైవ మూర్తి.

అన్న ... భువిలో అజాత శత్రువైన అపరంజి స్ఫూర్తి,

ఆధ్యాత్మిక విరహార్తి !

అమ్మ... అనురాగ చిహ్నం - విలసిత కీర్తి వల్లి

అన్న ... త్యాగానికే సంకేతం రాగరసాంతరంగం

అమ్మ ... వేదాంత ధ్వని, అమ్మ ... విదుషి

అన్న ... సాహిత్యధుని, అన్న.... విదుడు

అమ్మ... విశ్వంభర, అన్న.... విబుధుడు

అమ్మ ... విరాగిణి

అన్న... విరహి

అమ్మ... దక్షిణేశ్వర కాళిక

అన్న.... శ్రీరామకృష్ణ పరమహంస

అమ్మ... అర్చా మందిరంలో అన్న శాశ్వత పూజారి

అది అమ్మ నియామకం, ఇక లేదు ప్రశ్నార్థకం ?

కనుక ఆ స్థానం శాశ్వతం, అజరం, అమరం

అన్న జీవితం చరితార్థం, త్యాగం పరిత్యాగం

అస్మదాదుల ఆదర్శ శిఖరం, ఆ జీవనం వేదాంత సారాంశం

అదొక పరాగ పరిమళం

అదొక వెన్నెల కెరటం.

2 నాంది

" All my brothers,
Your minds with those things,
that are good and that are deserve
Praise things that are true
noble, right, Pure, Lovely
and honouroble - And the
God, who gives peace will be
with you"

- St. Paul

3 నీ పేరే మానవత

''తుఫానులకు దడిసే వాళ్ళు జీవన్మృతులు
''తుఫానులతో నడిచే వాళ్ళు చైతన్య వ్రతులు''

- ఖలీల్‌జిబ్రాన్

అది 1977 లో తుఫాను ప్రళయం.

మిన్ను మన్ను ఏకం చేసే వర్షధారలు. బంగాళా ఖాతం పొంగిందా, నల్ల మడ డ్రైన్‌కు గండిపడిందా అన్న చందంగా వర్షపు నీరు గ్రామంలోకి ప్రవేశించింది. బొ్డ్రాయి దాటి బిలాబిలా ఊరిలోకి సాగిపోయింది.

''నదీనాం సాగరోగతిః'' అన్నట్లు వెల్లువగా వచ్చిన వరద నీరు ఊరిలో లోతట్టు ప్రాంతమయిన చెరువులో ఉధృతంగా పరవళ్ళు తొక్కింది.

గ్రామం గ్రామం గజగజలాడి పోయింది. ప్రాణభయం బ్రతుకు భయం ప్రారంభమైంది. మేడలు, మిద్దెలు, పెంకుటిళ్ళ వాళ్ళు తడిపొడిగా ఆ రాత్రి గడిపారు. మరి పూరిళ్ళలో కాపురం చేసే అధోజగత్సహోదరులు - హరిజనులు, ఒడ్డెరలు - వీరి పరిస్థితి ఏమిటి ? ప్రభుత్వం కదిలి వచ్చింది. గుడిసెకు ఇంత ఇవ్వాలి, కూలిన ఇంటికి ఇంత ఇవ్వాలి అని షరతు పెట్టి వివరాల సేకరణ ప్రారంభించింది. ఆ గ్రామ కరణం అందరిలాంటి కరణం కాడు. చేతికి ఎముక లేని వాడు, తన మదిలో గదులు లేని వాడు, తన మనస్సే మమతల కోవెలగా మలచుకొన్న వాడు ''ఓయ్'' అంటే ''ఓ'' యని వచ్చి ఆదుకునే వాడు. అతడు వచ్చి చూశాడు గుడిసె వాసుల దుర్భర పరిస్థితికి చలించి పోయాడు. కళ్ళనీళ్ళ పర్యంతమై అందరికీ సహాయమందించ నిశ్చయించుకున్నాడు. నిబంధనల అడ్డురాలేదు - ఆర్తిముందు, ఆకలి ముందు. ఉద్యోగం పణంగా పెట్టాడు - షరతుల విషశృంఖలాలను ఎదిరించి నిలిచాడు.

చేయెత్తి మ్రొక్కారు బాధితులు, దళితులు దండం పెట్టుకున్నారు. సన్నకారు జనం తమ పెన్నిధిగా భావించుకున్నారు. '' ఆ అయ్యా దేవుడు, ఆ తండ్రి చల్లగా

బతకాలి''. అని మూగగొంతుకులతో మనసారా కోరుకున్నారు. కరణం నిబంధనలను అతిక్రమించాడనే అభియోగం చేశారు అసూయాగ్రస్తులు. విచారించింది ప్రభుత్వం. స్వచ్ఛ స్వర్ణ సీత వలె బయట పడ్డాడు, పులుకడిగిన ముత్యం వలె ప్రకాశించాడు.

ఎవరా మానవతా మూర్తి ?
ఎవరా గౌతముని కారుణ్య హృదిని స్ఫూర్తిగా
పొందిన అనురాగ మూర్తి ?
ఇంతెవరు ?
మన రామకృష్ణ మూర్తి.
మన అప్పికట్ల కరణం.

-)o(-

అమ్మతలపే నాకు ప్రాణం
అమ్మ మరుపే నాకు మరణం - అన్నయ్య

అమ్మ ! నీదుపథం విడచి పారిపోను
నీదుపదం వదలి జారిపోను - అన్నయ్య

అమ్మే నాకలం- నాసకలం - అన్నయ్య

అమ్మా -
ఎముకలేదు నీ చేతికి
ఎదురు లేదు నీ చేతకు - అన్నయ్య

నీ పద పీఠిలో కలసిపోకతప్పదు
లోకంలోని అన్నిగురు పీఠాలు
నీ పద సంపదలో కరిగిపోకతప్పదు
అన్ని మతాల అన్ని మార్గాల పాఠాలు - అన్నయ్య

4 మా కధానాయకుడు

" ఏను తెచ్చిన మృదుశుక్తిలోని జాతి
ముత్యములను లోకము ముందు పోయుచుంటి;
హృద్యమై యెప్పు వానిని సేరి కొనుడు
అభిరుచి కొలంది రౌద్ర సౌమ్యముల నరసి" - రాయప్రోలు.

"నారాయణరావు మనస్సు చాలా మెత్తన. ఒకళ్ళ బాధ చూడలేడు. చిన్నతనంలో ఎవరైనా ఏడిస్తే వాడి కళ్ళ గౌతమి తిరిగేది. తన అందమైన వస్తువులని వాళ్ళకిచ్చి ఊరడించటానికి ప్రయత్నించే వాడు. బళ్లో చదివేటప్పుడు కూడా బొమ్మలు తిను బండారాలు అందరికీ అస్తమానం పంచుతూ ఉండేవాడు". ఇది నారాయణ రావు మనస్తత్వం, ఇదొక విశిష్ట వ్యక్తిత్వం.

"నారాయణ రావు ఎప్పుడు ఏ పరీక్ష తప్పలేదు. ప్రతి తరగతిలోనూ మొదటి వాడే. ఇంటర్ మూడు సబ్జెక్ట్‌లో మొదటి మార్కులు, బంగారు పతకాలు సంపాదించాడు" ఇలా బాపిరాజు సృష్టించిన "నారాయణరావు" మనస్వి, ధీరోదాత్తుడు, రూపసి, పరోపకారి, భగ్నహృదయుడు, స్నేహశీలి, సముద్రగంభీరుడు. లలిత కళాసక్తుడు, రాజకీయ వేత్త, ఆదర్శ నాయకుడు. అడివి బాపిరాజు తన ప్రియమిత్రుడైన శ్రీ ముష్టి లక్ష్మీనారాయణను దృష్టిలో పెట్టుకొని ఈ పాత్ర రూపొం దించారన్నదే కొందరి అభిప్రాయం. నిజానిజాలు తెలియవు కాని బాపిరాజు గుణగణాలే నారాయణరావులో ప్రతి ఫలించాయన్నది స్పష్టం.

"అడవి బాపిరాజు అమర సృష్టి "నారాయణరావు". ఆంధ్రవిశ్వవిద్యాలయం నవలా రచన పోటీలో విశ్వనాధ "వేయిపడగలు"కు దీటుగా నిలిచి బహుమతి పొందిన అనర్ఘనవలా శిల్పం. అద్వితీయ రచనా విన్నాణం, అనన్య ప్రతిభా వ్యుత్పత్తులు ఈ నవలా నాయకుని పాత్ర చిత్రణలో కన్పిస్తాయి.

బాపిరాజుగారి కధానాయకుడు నారాయణ రావు, ధీరోదాత్తుడు అసలు సిసలు నాయకుడు, నిష్కళంక ప్రేమికుడు, భావుకుడు, స్వాప్నికుడు, కర్తవ్య నిర్వహణలో అచంచల హిమవన్నగ సమానుడు, ఆటలలో, చదువు సంధ్యలలో, సేవాను రక్తిలో

సాటిలేని మేటి. కాని కొంత కాలం పాటు అర్ధాంగి అనురాగం పొందలేక పోతాడు. దాంపత్య మాధుర్యాన్ని అనుభవించ లేక పోతాడు. కాని అతని ప్రేమకు పాత్రులైన వారంతా ఆ విలక్షణ వ్యక్తిత్వానికి లొంగి పోతారు. ఆఖరికి శారద (అతని భార్య) అతన్ని అర్థం చేసుకొని తన పొరబాటు గ్రహిస్తుంది.

నారాయణ రావు పాత్ర - ఆనాటి యువలోకానికి ఒక ఆదర్శవంతుడైన అపురూప వ్యక్తి పాత్రగా ఎంతో అభిమాన పాత్రమైంది. అంతే కాక ఆ పాత్ర వంటి వ్యక్తుల కోసం వెతకటం కూడా అలవాటైంది. మాకు రామకృష్ణ మూర్తిలో నారాయణ రావు ఛాయలు కనిపించేవి. నారాయణరావు వలెనే ఇతడు కూడా ధీరోదాత్తుడు. అన్ని రంగాల్లో ఆరి తేరినవాడు. అకుంఠిత దీక్షాదక్షుడు. బహుముఖ ప్రజ్ఞాధురీణుడు, దైవాంశ సంభూతుడు. చదువుకునే రోజుల్లో కుశాగ్ర బుద్ధితో అందరిలో మొదటి వాడుగా ఉండేవాడు. బ్యాట్‌మింటన్, చెడుగుడు ఆటల్లో మేటిగా ఉండేవాడు. జిల్లా స్థాయి గ్రిగ్ పోటీల్లో కబాడి ఆటగాడిగా పాల్గొని అందరి ప్రశంస పొందేవాడు. ఆ రోజుల్లో ''కాబోయే గ్రామకరణం'' ఇలా చెడుగుడు ఆడటం కొందరికి ఆశ్చర్యం, మరి కొందరికి ఆనందం కల్గించేది.

మేము బాల్య దశలో ఉన్నప్పుడు మా గ్రామంలో అఖిలభారత స్థాయిలో చెడుగుడు పోటీలు జరిగేవి. వాటిల్లో ఆంధ్ర దేశ నలుమూలల నుంచి ఎన్నో టీమ్‌లు వచ్చి పాల్గొనేవి. నాటి మేటి ఆటగాళ్ళు - ధనంజయ, సుబ్బులు, చంచయ్య, చలసాని బ్రదర్స్ - ఇత్యాదులు మా గ్రామంలో అద్భుతమైన క్రీడా వైదుష్యం ప్రదర్శించేవారు. రామకృష్ణ అన్నయ్య ప్రోత్సాహంతో నేను (రచయిత), కుర్రా అంకినీడు, కుర్రా కృష్ణ మూర్తి, మన్నె వెంకటేశ్వర్లు, భట్టిప్రోలు చలపతిరావు, గుడివాడ సత్యనారాయణ, గుడివాడ సాంబశివరావు, కొడాలి బసవయ్య, కొడాలి రాఘవరావు, కుర్రా చెంచు నారాయణ, గొగినేని నాగేశ్వర రావు మొదలగువారు కూడా వీటికి హాజరయ్యే వాళ్ళము. ఈ విధంగా క్రీడలపట్ల మాలో ఉత్సాహం పురికొల్పింది అతడే. గ్రామంలో తరచుగా (వేసవిలో) పూరిండ్లు, గడ్డివాములు పరశురామ ప్రీతి అవుతుండేవి. నీళ్ళకడవలతో పరుగులు పెట్టి మంటలు ఆర్పేవాడు - అన్నయ్య. ఈ ప్రవృత్తే అందరి జీవితాల్లో మంటల్ని ఆర్పేందుకు పురికొల్పింది. మండే జీవితాల్లో మంటల్ని ఆర్పేందుకు ప్రేరణ కలిగించింది అనంతర కాలంలో.

అప్పికట్ల గ్రామంలో గ్రంథాలయ స్థాపన చేసేందుకు అన్నయ్య పూనుకున్నప్పుడు దానికి అనుబంధంగా విక్రమ్ స్పోర్ట్స్ క్లబ్, నాగార్జున కళాసమితి స్థాపించాలని కూడా ప్రతిపాదించాడు. దీనికి కారణం క్రీడల పట్ల, లలిత కళల పట్ల అతనికున్న అకుంఠిత అభిమానమే. ఈ విషయంలో అప్పటి గ్రామ సర్పంచ్ ఇనగంటి ముత్తయ్య, కుర్రా వెంకయ్య రామకృష్ణ అన్నయ్యకు ఎంతో సహకరించారు. నిజానికి అవి స్వర్ణయుగపు రోజులు - సాయంకాలాలు శివాలయాల ప్రాంగణంలోనో రైల్వేస్టేషన్ ఒంతెన మీదనో శర్మ (ఈతేరు)తో కలిసి గడిపే వాళ్ళం. ఈ తేరు వెళ్ళి గ్రంథాలయంలో పుస్తకాలు తెచ్చుకొని చదివే వాళ్ళం.

'' నారాయణ రావులో రామకృష్ణ కన్పిస్తాడు
రామకృష్ణలో నారాయణరావు ప్రభవిస్తాడు''.

అనేది అందరి మాట.

''ఆ విలాసము నా హృదయము హరించె
రజని సంధ్యా కషాయ చిత్రమును బోలె;
తిరుగువాడ స్వచ్ఛంద సుందర విపంచి
కాలతా వశమగు స్వరగతి వాధాన'' - రాయప్రోలు

-) o (-

అమ్మా !
నా ప్రాణం నీవు
నా ప్రేరణ నీవు - అన్నయ్య

అమ్మా !
నీ వాణిని నేను
నీ వాడిని నేను - అన్నయ్య

అమ్మా -
ఈ బ్రహ్మాండాలనే కన్న బొజ్జవు
జగద్గురువులకే నీవు ఒజ్జవు
నీనడవడి లోకానికే ఒరవడి
నీ ఒడి మమతలకూ దేవతలకూ గర్భగుడి - అన్నయ్య

5 పుట్టు పూర్వోత్తరాలు

"పరిమళాల నెవడాపును ?
పైరగాలి నెవడాపును?" - సి.నా.రె.

ఇది ఒక జీవిత యాత్ర. ఒక సామాన్య వ్యక్తి ఆధ్యాత్మిక సామ్యవాద జీవన పరిణామ గతిని ప్రతిబింబించే జీవనయాత్రా చరిత్ర. ఇది కొండముది రామకృష్ణ జీవిత కథ మాత్రమే కాదు, ఒక సాధారణ వ్యక్తి ఒక అసాధారణ వ్యవస్థగా రూపొందిన అద్భుత చరిత్ర. దీనిలో ఎన్నో ఘట్టాలు, ఎందరో సహవాసులు.... ఎన్నో ఉత్థాన పతనాలు....

అప్పికట్ల గ్రామం - గుంటూరు జిల్లా బాపట్ల తాలూకా (ప్రస్తుతం బాపట్ల మండలం) రెండు వేల గృహాలు, నాలుగు వేల జనాభాతో ఆస్పత్రి, హైస్కూలు, రైల్వేస్టేషన్, పోస్టాఫీసు, ఇవన్నీ ఉన్న ఓ కుగ్రామం. అక్కడ దాదాపు అంతా వ్యవసాయం పై ఆధారపడి జీవించే రైతాంగమే. కాంట్రాక్టర్లు కొద్ది మంది మాత్రమే ఉన్నారు. జానపద కవి సార్వభౌముడు కొసరాజు రాఘవయ్య చౌదరి ("ఏరువాకా సాగారో రన్నో చిన్నన్నా") అని ఎలుగెత్తి పాడిన గ్రామం. రైతాంగ ఉద్యమానికి పుట్టినిల్లుగా, ఆచార్య రంగా భావాలకు అనుగుణంగా నడుచుకునే ప్రజలు ఆనాడు ఇక్కడ ఎక్కువగా కన్పించే వారు. తుమ్మల సీతారామమూర్తి గారిని "అభినవ తిక్కన"గా సంభావించి సత్కరించి గ్రామంలో నివేశన సదుపాయం కల్పించిన వదాన్యులు ఉన్న గ్రామం. తర్క, వేదాంత పారంగతులు, తిరుమల తిరుపతి దేవస్థాన ఆస్థాన పండితులు శ్రీ వేదాంతం జగన్నాథాచార్యుల అమృత వాణి ఆర్షకథాసుధలు, శ్రీరామ అమృత గాథలుగా వర్షించిన గ్రామం. శ్రీమతి అమరేశ్వరి వంటి హైకోర్టు న్యాయమూర్తులను ఆడపడుచులుగా పొందిన గ్రామం. కవులను, కళాకారులను ప్రోత్సహించే గ్రామం. కక్షలకు, కార్పణ్యాలకు స్థావరంగా మారి, అనారోగ్య సామాజిక వాతావరణం ఏర్పడినా, సంస్కృతి సంప్రదాయాలను విస్మరించని గ్రామం. ఈ గ్రామం తొలి కాపులైన మల్లంపాటి వారు వెంట తెచ్చుకున్న బ్రాహ్మణ కుటుంబాలలో కొండముది వారిది ప్రధానమైనది. అందుకనే మల్లంపాటి సోమయ్య చివరి వరకు అప్పికట్లలో రామకృష్ణ అన్నయ్యకు అండగా

నిలిచాడు. కొండముది వారి స్వస్థలము పొన్నూరు సమీపంలోని కొండముది గ్రామం. అప్పికట్ల వచ్చిన కొండముది వంశానికి కొండముది అప్పల రాజు మూల పురుషుడు. వారి గోత్రము ''కాస్యపస'' గోత్రము. ఆరువేలనియోగులు. వారిది ఆపస్తంభ సూత్రము. కాశ్యప, వత్సార, నైధ్రువ, రేభ, రైభశండిల, శాండిల్య సప్తార్షేయము. ఆవంశంలోని కొండముది రామకృష్ణయ్య గారు గ్రామ కరణంగా పని చేశారు. ఆయన జీవించింది అల్పకాలం. ఆయన ఏకైక పుత్రుడు వెంకట సుబ్బారావు. ఆయన జీవించిందీ అల్పకాలమే. కాని ఆయన సాధించింది అనల్పం. వ్యవహారదక్షునిగా పేరు పొందారు. ఆయన మరణిస్తే గ్రామంయావత్తు కన్నీరు కార్చింది. ఆయన అందరి వాడు. ముఖ్యంగా ఒడ్డెరలు, హరిజనులు ''మాకు దీపం పెట్టాడు'' అని కన్నీరు మున్నీరుగా విలపించారు. ఆయన భార్య అన్నపూర్ణమ్మగారు మను చరిత్రలోని ఉత్తమ గృహిణికి సాటిరాగల పుణ్య స్త్రీ. ''వండ నలయదు వేవురు వచ్చిరేని, అతిధులేతెర నడిరేయి అయిన పెట్టు'' అనడం ఆమె పట్ల సార్ధక మైన మాట. ఆమె మనస్విని. నిరంతర అన్నదానం ఆమె అభిమాన అంశం.

ఆ దంపతుల తొలి జననం వసుమతి, రెండవ కుమార్తె సీతారామమ్మ, మూడవ జననం రామకృష్ణ, నాలుగో బిడ్డ హనుమంతరావు, అయిదవ సంతానం హేమలత. మధ్య తరగతి బ్రాహ్మణ కుటుంబంలో 1934 జూన్ 26న (భావ జ్యేష్ఠ శుద్ధ చతుర్దశి మంగళ వారం) జన్మించిన రామకృష్ణ సింహలగ్న జాతకుడు. అందుకే ఏరంగంలోనైనా ప్రధమ స్థానంలో ఉండేవాడు. తల్లి అన్నపూర్ణమ్మ, ఆమె అత్త లక్ష్మీ నరసమ్మ అల్లారు ముద్దుగా పిల్లల్ని సాకి పెంచి పెద్దవారిని చేశారు. పెద్దమ్మాయిని బూదరాజు వెంకట రత్నం (స్వర్ణ) గారికి, రెండవ అమ్మాయిని లక్కరాజు హనుమంతరావు (బట్టిప్రోలు) గారికి, మూడవ అమ్మాయిని బూదరాజు శేషగిరి రావు (చీరాల) గారికి ఇచ్చి వివాహం చేశారు. పెద్ద కుమారుడు రామకృష్ణ మూర్తి (తాతగారి పేరే) గ్రామ కరణం కావటం మొదటి నుంచీ తల్లికీ, బామ్మకూ బహు ఇష్టమైన విషయం. గ్రామ కరిణీకం వారి కుటుంబంలోనిదే. ఇంత వరకు వారి పేరున శ్రీ కొండముది చిన వెంకటప్పయ్య, శ్రీ కొండముది రామమూర్తి చేస్తున్నారు. కనుక ఎలాగైనా ఆ కరణీకం మళ్ళీ ఆ కుటుంబంలోకి రావాలను కోవడం విడ్డూరం ఏమికాదు. అప్పటికే రామకృష్ణమూర్తి

- పువ్వు పుట్టగానే పరిమళించినట్లు - అన్ని రంగాలలలోనూ అగ్రగామిగా నిలిచాడు. మహా పురుషులు రామకృష్ణ పరమహంస, జిడ్డు కృష్ణమూర్తి, యూ. జి. కృష్ణమూర్తి, తదితరుల వలె రామకృష్ణకు కూడా ఆ పేరు తగిపోయిందనేది అనంతర కాలం రుజువు చేసింది. మధ్య తరగతి బ్రాహ్మణ కుటుంబం - చిన్నతనంలోనే ఇంటి బాధ్యత రావడం-అదే జిల్లెళ్ళమూడి సంస్థ పాలనకు ఉపయోగపడింది. గ్రామం యావత్తూ ఎదురు చూస్తున్నది ఎప్పుడు ఈ ధర్మరాజు గ్రామానికి ''కరణం గారు'' అవుతారా అని ! రామకృష్ణకు యస్. యల్. సి. కాగానే వివాహం అయింది. తల్లి కోరికపై మేన మామ నందిరాజు సత్యనారాయణ గారి కుమార్తె పద్మావతిని వివాహం చేసుకున్నాడు (21-4-50). అతని తమ్ముడు హనుమంతరావు విద్యలో ప్రతిభా ప్రాభవాలు ప్రదర్శించి యమ్. యస్. సి. ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణుడై ఉద్యోగస్తు డయ్యాడు. ఈమని వాస్తవ్యులు, భూస్వాములు అయిన పెద్దిరాజు సూర్యనారాయణ గారి కుమార్తె భానుమతిని వివాహం చేసుకొని విజయవాడలో స్థిర పడ్డాడు. అనంతర కాలంలో హైద్రాబాద్‌కు మకాం మార్చటం జరిగింది.

రామకృష్ణ మూర్తి కరణీకం ఎలా చేశాడన్నది మొదటి అధ్యాయంలోనే కొంత చవిచూశారు. '' ఊరుమీద ఊరుపడ్డా కరణం మీద కాసుపడదనే'' పాత సామెతనే పరాస్తం చేసి, సొంత డబ్బు ఖర్చు పెట్టి ప్రజలకు సేవ చేసిన ఆదర్శ గ్రామోద్యోగిగా రామకృష్ణ మూర్తి పేరొందాడు. ఇదో విలక్షణ మైన కరణీకం. కొలతలకు, పొలం నెంబర్లకు కాసులు వసూలు చేసే సంప్రదాయం ఇక్కడ లేదు. తాలూకాఫీసులో ఏ సర్టిఫికేట్టు కావాలన్నా క్షణాలమీద సొంత ఖర్చుతో తెచ్చిపెట్టే కొత్తరకం కరణీకం ఇక్కడ కన్పిస్తుంగి. గ్రామానికి మంచి చేసే కరణం కనుక గ్రామం మీద గ్రామం పడక పోయినా ఈ కరణం మీద కాసు పడుతూనే ఉంది. ఎవరు వచ్చినా భోజన సౌకర్యం వీరి ఇంటిలోనే. ఎవరినీ కాదనలేని ఆర్ద్రహృదయం. ఎవరినీ నొప్పించలేని మెత్తని మనస్సు, ఇంత కరకు లేని మెత్తని కరణమైనా జమా బందీ సమయంలో ఎప్పుడూ రెడ్ (బెస్ట్) మార్కులే పొందేవాడు. ఈ విషయంలో అన్నయ్యకు ఎంతో సహకరించారు శ్రీ కొండముది రామమూర్తిగారు. మోతాదులు షేక్ అల్లాబక్ష్, షేక్ జాన్, వెంకటప్పయ్య, ఏసోబు అన్నయ్య నాయకత్వంలో కొత్తరకం గ్రామోద్యోగులుగా గ్రామ సేవ చేశారు.

గ్రామ సేవ : - గౌతమ గ్రంథాలయ స్థాపన అతనికి కీర్తి పతాక కాగా స్థానిక రామమందిరం మూత పడిపోగా ఉభయ పక్షాల మధ్య సామరస్యం సమకూర్చి, దాన్ని పునరుద్ధరించి ప్రారంభించడం అతని కీర్తికి మకుట ప్రదానం వంటిది. ఎవరి మాటవినని అప్పికట్ల ఆడపడుచులు మన్నె అనసూయమ్మ, మన్నె నాగేంద్రమ్మ, గోగినేని భారతి అన్నయ్యమాట అక్షరాల అమలు పరిచారు. అలాగే రక్షిత మంచి నీటి పథకం అతని నిస్వార్థ సేవకు శాశ్వత చిహ్నంగా నిలుస్తుంది. ఈ విషయంలో ఇసుక పల్లి సోదరులు రాధాకృష్ణమూర్తి, సూరావధానులు మరియు గ్రామ సర్పంచ్ ఇనగంటి పట్టాభిరామారావు అన్నయ్యకు ఎంతో సహకరించాడు. ఒక్క మాటలో అతడు ''అంతే వాసుల ఆరాధ్య దైవం''. మామిళ్ళపల్లి చక్రపాణి, కుర్రావెంకట్రావు బూర్సు వెంకటేశ్వర్లు, మన్నె సాంబశివ రావు, గుర్రాల రామారావు అన్నయ్యకు శిష్యులై మెలిగారు.

-)o(-

అమ్మా -
నీవు పెట్టే ఒక్క మెతుకు
మాజన్మ జన్మల ఆకలికే గొడ్డలి పెట్టు
అందుకే అంజలి ఘటించి అర్థిస్తున్నాను
నీచేతి మీదుగా ఒక్క ముద్ద అన్నం పెట్టు - అన్నయ్య

అమ్మా...
నీ గుండె పాలకొండా
నీవు కనికరపు మంచుకొండా - అన్నయ్య

అమ్మా...
నీవు ఉన్నావు మా ఎదల నిండా
నీకిదే దండాలదండా
దీవించు నాబ్రతుక పండా - అన్నయ్య

అమ్మ చెంతనే ఉంటె అదోలోకం
అమ్మ చింతన లేకుంటె అధోలోకం - అన్నయ్య

6 కవితా వినోది

''కవితా రసపు జల్లు
ఖడ్గాల గలగల్లు
కరణాలకే చెల్లు
ఓ కూనలమ్మ'' - ఆరుద్ర

కరణాల ఇళ్ళు తెలుగు శారదకు పుట్టిళ్ళు. రామకృష్ణ మూర్తి కవి కాదు, కనీసం ఛందో వ్యాకరణ శాస్త్ర పరిచయం కూడా లేనివాడు. అయినా చిన్న వయసులోనే విజయవాడ ఆకాశవాణి కేంద్రం నుంచి ఆణిముత్యాల వంటి సంగీత రూపకాలు వ్రాసి ప్రసారం చేశాడు. ''ప్రకృతి సందేశం'' ''జీవన భద్రాణి పశ్యతి'' (బ్రతికి యుండిన సుఖములు బడయవచ్చు'') అనే ఉదాత్త సందేశాన్ని అందించే సంగీత రూపకాలు ఒక పక్క వ్రాస్తూనే మరో ప్రక్క బహుచిక్కని భావాల అతి చక్కని గేయాలను ''తెలుగు స్వతంత్ర'' ''స్రవంతి'', ''ప్రతిభ'', ''ప్రజామత'', ''ప్రగతి'', ''నగారా'', ''శారద'', ఇత్యాది పత్రికలలో ప్రచురిస్తుండే వాడు. ''తపస్వి'', 'దేవీచరణ్' అప్పుడతని కలం పేర్లు. ''రహి'' తరువాత అమ్మ పెట్టిన కలం పేరు. అతని శైలిలో ''సి.నా.రే.'' పోకడలు కన్పిస్తున్నాయని అందరూ ప్రశంసలు కురిపించే వారు. భావనలో జీవిత వలయాలు దాటడనే ప్రతిజ్ఞ కనిపించేదని పలువురు భావించే వారు. నాటక రంగం అతని ఆరో ప్రాణం. గ్రామంలో ఔత్సాహికులను ప్రోత్సాహించి ఎన్నో నాటకాలు, నాటికలు వేయించడమే కాక పొరుగు గ్రామాలకు సైతం వెళ్ళి మంచి నాటకాలను చూసి ఆనందించే వాడు. ఇక గేయ కవిత్వ రచన అంతా ఒక ఎత్తు అయితే వచన కవితలో ''శ్రీచరణ వైభవం'' మరో ఎత్తు. '' ఇది ఒక క్రమ కవిత్వ మనోజ్ఞ కల్పనోజ్జ్వల కృతి''. ఈ గ్రంథం రామకృష్ణకు డాక్టరేట్ ఇచ్చే ఉజ్జ్వల భావ ప్రపూరిత మహత్తర భక్త్యా వేశ జనిత మందార మకరందం. ఆది శంకరుల తరువాత అమ్మవారిని కేవలం ఒక అంగంపై దృష్టి నిలిపి అలౌకిక భక్తి పారవశ్యంతో స్తుతించడం రామకృష్ణకే చెల్లిందని ఈ గ్రంథం ఋజువు చేస్తున్నది. ఈ గ్రంథం మీద చి॥ యస్. యల్. వి. ఉమామహేశ్వర

రావు ప్రొఫెసర్ శ్రీ ముదిగొండ వీరభద్రయ్యగారి పర్యవేక్షణలో పరిశోధక గ్రంథం వ్రాసి సెంట్రల్ యూనివర్సిటీ (హైద్రాబాదు) వారిచే యం.ఫిల్ పట్టా పొందాడు. జిల్లెళ్ళమూడి ప్రస్థానంలో రామకృష్ణ అమ్మ జీవిత చరిత్రను ''జీవిత మహోదధిలో తరంగాలుగా'' వ్రాసి పాఠక లోకాన్ని దివ్య స్రోతస్వినీ తరంగాలపై ఉయ్యాల లూగించారు. అంతకు మించిన రచన ''అమ్మ'' చలన చిత్రానికి అన్నయ్య సమకూర్చినది. ఇదొక అవిస్మరణీయ, అననుకరణీయభావవాహిని. అప్పుడు సెన్సార్ సభ్యులలో కొందరు ఇలా వ్యాఖ్యానించారు. '' ఈ రచన చేసినకొండముది రామకృష్ణ సినిమారంగం నుంచి వైదొలగటం జరిగితే మనం ఒక ''వేటూరిని'' కోల్పోయి నట్టే''. అంతటి రసతరంగితం ''అమ్మ'' చిత్ర రచనా శిల్పం. రచయితగా జీవన్ముక్తుడు రామకృష్ణ అన్నయ్య.

రెండున్నర దశాబ్దాలు ''మాతృశ్రీ'' పత్రికా సంపాదకుడిగా రామకృష్ణ వ్రాసిన ప్రతి సంపాదకీయం సంతత స్మరణీయం, పరమ రమణీయం. వాటిల్లో సమయస్ఫూర్తితో కూడిన రసవత్కవితా కౌశలం కనిపిస్తుంది. వాటి అర్థగాంభీర్యం, పదప్రయోగ ఔచిత్యం అసదృశం. అమ్మతత్వానికి, జీవితానికి దర్పణాలుగా ''మాతృదర్శనం'' చేసిన అన్నయ్యను కవితా కేదారాన్ని పండించిన హాలికుడిగా అన్ని వేళలా తలుచుకునేందుకు ప్రతి సంపాదకీయం -

'' ఒక పారిజాత పరిమళం.
ఒక వెన్నెల కిరణం..
ఒక మంజుల గానం ...
ఒక నవరస కావ్యం...
లలిత శిరీష పుష్పమృదులం
శారద యామినీ మధుర చంద్రికా సదృశం''
ఈ సంపాదకీయాల సంపుటే ''మాతృసంహిత''

రాత, మాట, చేత, ఒకే బాణీగా రూపు దిద్దుకున్న వ్యక్తిత్వం ఆయనది. ''సత్యం'' ఆయన జీవన నాడి కాగా ఉషోదయ తుషార బిందు స్వచ్ఛత ఆయన రచనలది. అన్నయ్య ఇతర రచనలు అనసూయ కళ్యాణం, వాత్సల్య గంగ, అన్నపూర్ణాలయం,

హైమాలయం, అమ్మ - అవతార మూర్తి, దేవడిగెలుపు (అముద్రితం), అంత స్స్రోత్రం (అముద్రితం), విశ్వ సంస్తుతి.

> ''అక్షర జ్ఞానమెరుగదో ఆంధ్రజాతి
> విమల కృష్ణానదీ సైకతములయందు
> కోకిలపుబాట పిచ్చుక గూళ్ళు కట్టి
> నేర్చుకున్నది పూర్ణిమా నిశల యందు'' - విశ్వనాథ

-)o(-

అమ్మా
నేనుండేది నీ చరణాల వద్దా!
నేతినేది నీ చేతి గోరుముద్దా! - అన్నయ్య

నాతప్పులు చూడని ఒప్పులకుప్పా!
పమున్నది నాకిల నీదయ తప్పా! - అన్నయ్య

వెన్నెల కొండా! వెన్నెల కొండా!
మాతృత్వం ఎగరేసిన జండా! - అన్నయ్య

దీవింపుము మా బ్రతుకులు పండా!
నీ మెడ కేతును మమతల దండా! - అన్నయ్య

అదే హైమాలయం
అదే ఆధ్యాత్మ హిమాలయం
అదే అత్యున్నత మహిమాలయం - అన్నయ్య

అమ్మా..
నీ సేవలోనే నాబ్రతుకు సాగనీ
నీ ధ్యాసలోనే నాశ్వాస ఆగనీ - అన్నయ్య

7 పరంపర

''భావ మొక్కడు గాగ భావార్థమొక్కడై
రసభావ పరిణతి ఎసగ జేసి
తెర్పత్తు టొకడుగా తెరదించుటొక్కడై
జీవన సామరస్య ములగించి — పింగళి, కాటూరి.

కొండముది వారి వంశంలో కవితా ధోరణి మొదటినుంచి ఉంది. తెనాలిలో సుప్రసిద్ధ న్యాయవాది, జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ మాజీ అధ్యక్షుడు శ్రీ కొండముది శ్రీరాములు గారు అనేక ఉద్గ్రంథాలు వ్రాశారు. (నచకేతోపాఖ్యానం వంటివి). ఆయన కుమారుల్లో ఒకరైన గోపాలరాయ శర్మగారు నాటక రచయితగా లబ్ధ ప్రతిష్ఠుడు. ఆయన వ్రాసిన '' ఎదురీత'' ''గౌతమబుద్ధ'' వంటి నాటకాలకు ఆంధ్రనాటక కళాపరిషత్తు లో ఉత్తమ నాటక రచనకు ప్రధమ బహుమతులు లభించాయి, సినిమా రచయితగా ఎన్ని చిత్రాలకో - ముఖ్యంగా ''భరణీ'' వారి చిత్రాలకు రసవంతమైన మాటలు, పాటలు, సమకూర్చిన సాహితీ మూర్తి. కొండముది నర్సింహం పంతులు గారు అప్పికట్ల మనేదారుగా, పెద్ద భూస్వామిగా ఉండేవారు. ఆయన స్వయంగా శతావధాని. కొసరాజు, కొడాలి, ఇనగంటి, కుర్రా వంశీయులలో కొందరికి ఛంధ్వస్సు కవిత్వ తత్వం నేర్పిన అపరకవిబ్రహ్మ చాప కూటి సిద్ధాంతాన్ని ఆనాడే అమలు జరిపిన సామాజిక సామ్యవాది, అపర బ్రహ్మనాయడు.

కొండముది శ్రీ రామచంద్రమూర్తి,M.A.Phd., పట్టభద్రుడే కాక వివిధ రచనా ప్రయోగ కౌశలుడు. అనేక కధానికలు, నాటికలు, నాటకాలు, వ్యాసాలు, విమర్శలు, సమీక్షలు, పుంఖాను పుంఖంగా చేసి తన అక్షర తూణీరం నుంచి శరపరంపరగా రచనాస్త్రాలను ప్రయోగించిన నవనవోన్మేష ప్రతిభాశాలి అయిన రచనా సవ్యసాచి. దాసరి సమర్పించిన ''విశ్వామిత్ర''కు ఊపిరిఊది, ''మండలాధీశుడు''కు ప్రాణం పోసి, కూచిపూడి నృత్యానికి అందెలు సవరించి'' ఆనంద భైరవి'' ఆలపించి, ప్రస్తుతం మంజుల ''మంజీర నాదం'' వినిపిస్తున్న విద్యావినోది. అతనికి సంప్రాప్త మనోహరి

చలన చిత్ర సుందరి. శ్రీరామ చంద్రమూర్తి అర్ధాంగి రుక్మిణీ దేవి స్వయంగా రచయిత్రి. అనేక కథానికలు, వ్యాసాలు వ్రాసి ఇటీవలె కాలధర్మం చెందిన విదుషీమణి. ఆకాశవాణి, ఆంధ్ర ప్రభ, ''విస్డమ్''ల ద్వారా అందరికీ పరిచితుడైన కొండముది దత్తాత్రేయ శర్మ వ్యాఖ్యాత, వ్యాసకర్త, కథకుడు, రచయిత, అనువాదకుడు, పత్రికా రంగంలో మూడు దశాబ్దాలకు పైగా పని చేశాడు. కొండముది హనుమంతరావు, **M.Sc.,** పట్టభద్రుడై ఆకాశవాణిలో ఇంజనీరుగా కొంతకాలం, విజయవాడ కాకరపర్తి భావనారాయణ కళాశాలలో ఆచార్యుడుగా కొంతకాలం పని చేసి అనేక వైజ్ఞానిక వ్యాసాలు వ్రాసి, ప్రసంగాలు చేసి, ఎన్నో ఉత్తమ శ్రేణి కథానికలు, నాటకాలు, వ్రాసిన లబ్ధ ప్రతిష్ఠుడు, ప్రతిభావంతుడు. ప్రస్తుతం హైదరాబాద్‌లో శ్రీ చైతన్య కళాశాలలో ఆచార్యత్వం నిర్వహిస్తున్నారు.

కొండముది వెంకట చలపతి రావు తెలుగులో **M.A.** డిగ్రీపొంది బాపట్ల ఆర్ట్స్ కళాశాలలో ఆంధ్రోపన్యాసకుడిగా పని చేస్తూ ఇటీవలె కాల ధర్మం చెందాడు. అతడు అనేక నాటకాలు వ్రాశాడు, ఇతర రచనలు చేశాడు. నవతరంలో కొండముది శ్రీ హర్ష (సాయిహర్ష) సినిమా గీత రచయితగా అచిర కాలంలోనే పేరు తెచ్చుకున్నాడు. పదబంధ కవిత అతని సొత్తు. కొండముది అనురాధ **(M.A., Telugu)** మద్రాస్ విశ్వవిద్యాలయంలో ప్రథమ శ్రేణిలో **B.Sc., M.A.,** పట్టభద్రురాలై బెంగుళూరు ఆంధ్రవిజ్ఞాన పరిషత్తు వారి బంగారు పతకం '' ఆంధ్రభాషా భూషణ'' బిరుదు పొందింది. **B.Ed.,** ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణురాలై అధ్యాపక వృత్తి చేపట్టింది. ఈ విధంగా కొండముది వారి వంశంలో ఎందరో అన్ని రంగాలలో ముందడుగు వేస్తున్నారు.

-) o (-

అమ్మా...
నీ వెనుక నేనడచి వస్తా !
నీ కొరకు చల్లగా నా బ్రతుకు ఇస్తా ! - అన్నయ్య

అమ్మా...
నీ అడుగు జాడలే - మణి దీప కిరణాలు
నీ గొడుగునీడనే - నా బ్రతుకుమరణాలు - అన్నయ్య

8 మహాలహరి

"విబుధ జనుల వలన విన్నంత కన్నంత
తెలియవచ్చెనంత" - పోతన

నిరంతరం అన్నదానం చేస్తూ ఆధ్యాత్మిక సందేశాలని అన్నంతో కలగలిపి కడుపు నింపే పెరుగుతున్నపు మూట, షడ్రుచుల తోట, మానవాళికి బంగారు బాట జిల్లెళ్ళమూడి అమ్మను సేవించడం రామకృష్ణ జీవితంలోని ఒక అద్భుత సంఘటన. ఒక ఆశ్చర్యకర మైన మలుపు.

అసలు రామకృష్ణకు ఆధ్యాత్మిక వాసన ఎలా అబ్బింది ? బాల్యదశలో తల్లి, బామ్మల దైవభక్తి, అభ్యాగతుల ఆదరణ అతనిపై ప్రభావం చూపాయి. "భక్తిలతా గ్రంథమాల" స్థాపించి రామభక్తుడై తన యావదాస్తిని దాన ధర్మాలకు వెచ్చించి అప్పికట్లలో "రాఘవయ్య పంతులు చెరువు" త్రవ్వించిన "సహజాద్వైతి" "సద్గురువు" శ్రీ పంగులూరి వీరరాఘవుడు రామకృష్ణకు తొలి ఆధ్యాత్మిక గురువు. ఎన్నో నిగూఢ ఆధ్యాత్మిక రహస్యాలను విప్పి చెప్పిన సద్గురువు. సంవత్సరంలో సగం రోజులు రామకృష్ణ ఇంట్లోనే భోజనం చేస్తూ ఆధ్యాత్మిక ప్రబోధం చేస్తుండే వాడాయన. పంగలూరి వారిది ఈ తేరు గ్రామమైతే మర్రిపూడి గ్రామంలోని శివార్చకులు నూతల పాటి వీరయ్యగారు రామకృష్ణలోని ఆధ్యాత్మిక సుగంధాన్ని ముందుగానే పసిగట్టి కాలువ గట్ల వెంట తిప్పుతూ ఎన్నో సుభాషితాలను సుబోధకంగా విప్పి చేప్పేవారు. అనంతర కాలంలో జిల్లెళ్ళమూడి "అమ్మ" కూడా వీరయ్యగారి పరిపక్వతను, ఘనతను శ్లాఘించడం జరిగింది. మర్రిపూడిలో అనేక యజ్ఞయా గాదులను నిర్వహించిన నిగూఢ భక్తి తత్పరుడు, ఋషితుల్యుడు శ్రీ వీరయ్యగారు.

అప్పట్లో ఆంధ్రదేశాన్ని తమ నామ సంకీర్తనతో ఉర్రూత లూగించిన శ్రీ సియా రఘువరదాస్ (పూర్వాశ్రమంలో శ్రీ పెమ్మరాజు విశ్వేశ్వర రావు) గారి ప్రభావం కూడా రామకృష్ణ పై ప్రగాఢంగా ఉంది. శ్రీ అవధూతేంద్ర సరస్వతీ స్వామిగా రూపాంతరం చెందిన శ్రీ రఘువర దాస్ గారి అమరగానలహరిలో మైమరచి పోయేవాడు రామకృష్ణ. శ్రీ అవధూతేంద్రుల మిత్రుడైన శ్రీ సత్య జ్ఞానేంద్ర స్వామి (పూర్వాశ్రమంలో శ్రీ చివుకుల వెంకటేశ్వరఅవధాని గారు) కూడా అప్పికట్లలో మకాంచేసి అనేక ఆధ్యాత్మిక విషయాలను ప్రబోధిస్తుండేవారు. ఈ విధంగా దాసుగారు,

అవధానులు గారు, కంభంపాటి శ్రీ రామచంద్రులుగారు రామకృష్ణ ఆధ్యాత్మిక అవరోహణకు తొలి మెట్లుగా నిలిచారు. ఇక అతని ఇంట్లో భాగవతం ''అమ్మ'' చదవటం, బామ్మ శ్రోత కావటం, మల్లంపాటి రత్తయ్యగారు వ్యాఖ్యానం చేయటం అతనిపై చిన్నతనంలోనే అప్రయత్నంగా ప్రభావం చూపాయి.

రామకృష్ణ తండ్రి తాతలు చిన్నతనంలోనే మృత్యువాత పడ్డారు. రామకృష్ణకు కూడా మారకం ఉందని జ్యోతిష్యులు చెప్పారు. అది 1964 జనవరి 10వ తేది. ఆనాడు జనక తల్లి అన్నపూర్ణమ్మ రామకృష్ణను జిల్లెళ్ళమూడి తీసుకువెళ్లి ''అమ్మ''కు తన బిడ్డను అప్పగించి ''చంపుకుంటావో, రక్షించుకుంటావో నీ ఇష్టం, నీ చేతుల్లో పెడుతున్నా'' అని చెప్పింది. జిల్లెళ్ళమూడి ''అమ్మ'' భర్త శ్రీ బ్రహ్మాండం నాగేశ్వరరావు గారు రామకృష్ణకు పితామహి రీత్యా దగ్గర బంధువు కూడా. కాని రామకృష్ణ ''అమ్మ''కు ''దత్తత'' ఇటు వంటి అసాధారణ పరిస్థితిలో జరిగింది. ''అమ్మ'' అన్నయ్యను రెండు చేతులతో స్వీకరించింది. అక్కున చేర్చుకుంది ఆశీర్వదించింది. శివాలయంలో వివిధ నదీ జలాలతో అభిషేకాలు, పూజలు జరిపించింది. రామకృష్ణను అపమృత్యువు నుండి ఆ తల్లి రక్షించింది. ఆనాటి నుండి రామకృష్ణ కొత్త తొడవు ధరించాడు. అప్పికట్ల కరణంగా పనిచేస్తున్నా జిల్లెళ్ళమూడి ''అమ్మ''కు ఉపకరణం అయినాడు. పొలాలు, భూముల కొలతను మాని ''అమ్మ''నే కొలవటం ప్రారంభించాడు. తనా మనా ధ్యాస లేకుండా త్రికరణ శుద్ధిగా అమ్మకు అంకితమైనాడు. స్వసుఖాన్ని, సంసార సుఖాన్ని త్యజించాడు. దాంపత్య జీవిత మధురిమను కాలదన్నాడు. సొంత పొలం, సొంత ఇల్లు, సొంత సంసారం అనే మాట మరచిపోయాడు. విశ్వజననీ కుటుంబ నిర్వహణలో సర్వస్వం అర్పించాడు. తన సొంత పొలంలో పండిన ధాన్యం బస్తాలన్నీ ఎన్నిసార్లు జిల్లెళ్ళమూడికి సమర్పించుకున్నాడో, సొంత ఆస్తి తనఖా పెట్టి, సొంత పూచీ పైన ఎన్ని ప్రోనోట్ల మీద సంతకాలు చేసి జిల్లెళ్ళమూడి సంస్థకు కొమ్ము కాచాడో ? ఎన్ని అంతర్యుద్ధాలకు కుటుంబ విమర్శలకు తట్టుకొని అమ్మసేవకు అహరహం అంకితమై, సర్వ సమర్పణమై శ్రీ చందనమై, అరిగి కరిగి పోయాడో - చరిత్రే సాక్ష్యం ఇస్తుంది.

-)o(-

అమ్మా...

నీ దారిలోనేను - మల్లె నై పూస్తా
నిను చూచి మైమరచి నాట్యాలు చేస్తా - అన్నయ్య

9 సంతతి

''సుఖాలు సూదుల మూటలు'' - అన్నమయ్య

'' ఎదమెత్తనౌటకై
సౌదగుందరా అంత
మదిగల అహమెల్ల
వదలి పోవునురా'' - బసవరాజు అప్పారావు

''వివాహం చేసుకొని గృహస్తుగా ఆధ్యాత్మిక సాధన చేయటం కోటలో ఉండి యుద్ధం చేయటం, సన్యసించటం కోటవిడిచి యుద్ధానికి వెళ్ళటం'' అనీ ''సర్వాన్ని అనుభవిస్తూ సర్వాన్నీ విడిచి పెట్టేదే వివాహం'' అనీ, ''కళంకరహితమైన మనస్సును కళంకరహితంగా మరొక వ్యక్తికి అర్పణం చేయటమే కళ్యాణం'' అనీ జిల్లెళ్ళమూడి అమ్మ అమోఘంగా నిర్వచించారు.

''భావం తెలుసుకొని ప్రవర్తించేదే భార్య'' అనీ
''బాధ్యత తీసుకొని భరించేవాడే భర్త '' అనీ ''అమ్మ''
నోట ముత్యాలు విప్పారు. సుబోధకంగా చెప్పారు.

రామకృష్ణ దాంపత్య జీవితం ఎంతో సుఖవంతంగా సాగిందని చెప్పటానికి వీలుకాక పోయినా గార్హస్థ్యజీవిత బాధ్యతలు సక్రమంగా నిర్వహించాడని నిస్సందేహంగా చెప్పవచ్చు. అతనికి ప్రథమ సంతానంగా సీతామహాలక్ష్మి జన్మించింది. రెండవ సంతానం సుబ్బారావు. మూడవ జననం సుధాకర్. నాలుగో బిడ్డ ప్రేమకుమార్. అయిదవ సంతానం రవి. సీతా మహాలక్ష్మిని మేనల్లుడు బూదరాజు మధుసూదనరావు . (L.I.C.) కిచ్చి వివాహం జరిపించాడు. మధుసూదనరావు కథకుడు, రచయిత. అన్నింటికి మించి ఆత్మావిష్కరణ కేంద్ర స్థాపకుడు. మనిషిని దివ్యుని చేసే ధ్యానం నలుగురికి ఎఱుక పరిచేందుకు "Spiritual Awakening Center" ప్రారంభించిన ఆత్మావిష్కారుడు. పెద్ద కుమారుడు సుబ్బారావు M.S.C. పట్టభద్రుడై, లౌకిక జీవన పథ పురోగామియై మేధావంతుడై, ప్రస్తుతం చైతన్యగ్రామీణ బ్యాంక్ మేనేజర్ పదవిలో కొనసాగుతున్నాడు. రెండవ కుమారుడు సుధాకర్ సుమధుర గీత రచయితగా కీర్తి గడించాడు. ''శ్రీహర్ష'' (సిరిహర్ష) కలం పేరుతో అనేక సినిమాలకు పాటలు సమకూర్చాడు. చిత్ర విచిత్ర

రీతిలో రసవత్ గీతికలను పదబంధ పారి జాతాలుగా మలిచాడు. ''పెదరాయుడు'' సినిమాలో అతడు వ్రాసిన ''కదిలే కాలమా, కాసేపు ఆగవమ్మా'' అనే పాట పలువురి ప్రశంసలనందుకుంది. మూడవ కుమారుడు ప్రేమకుమార్ నాలుగో కుమారుడు రవి ఇప్పుడిప్పుడే జీవిత పథంలోకి పాదం మోపారు. విద్యుక్త ధర్మ నిర్వహణ చేస్తూ సాగిపోతున్నారు.

కాలమూ, కెరటమూ ఎవరి కోసము ఆగవు కదా! పిత్రార్జితం స్థిరాస్తి అయిన పదహారు ఎకరాల మాగాణి భూమి కరిగి పోయి, తరిగి పోయి నాలుగు ఎకరాలలోకి వచ్చింది. గ్రామంలో తాత తండ్రులు ఇచ్చిన పెంకుటిల్లు తప్ప వేరే ఆస్తులేమీ లేవు. రామకృష్ణ సంపాదించుకున్నది జిల్లెళ్ళమూడి ''అమ్మ''తో అమర (అను) బంధం. రామకృష్ణ పోగొట్టుకున్నది పిత్రార్జితమైన ఆస్తి పాస్తులు. అన్యాయార్జన, అక్రమ సంపాదన - ఆ వంశంలోనే లేవు, ఆరక్తంలో ప్రవహించేది - స్వార్థంకాదు త్యాగమే! మనకు ఆంధ్రకేసరి ప్రకాశం పంతులుగారి ఛాయలు రామకృష్ణ అన్నయ్య నడకలో, నడతలో కన్పిస్తాయి.

-)O(-

''తుమ్మెదకు ఆ గౌరవం ఎందుకొచ్చిందంటే అది తన కోసం కష్టపడు తున్నందుకు కాదు. ఇతరులకోసం కష్ట పడుతున్నందుకే

-క్రిసోష్టమే

అమ్మ పెట్టిన అన్న సత్రం
అన్నపూర్ణకు శ్వేత ఛత్రం - అన్నయ్య

అమ్మ చరితమె అన్న సూక్తం
అమ్మ వాక్కే బ్రహ్మ సూత్రం - అన్నయ్య

అమ్మ రూపం జ్ఞానదీపం
అమ్మ నామం పరంధామం - అన్నయ్య

10 అనుంగు బిడ్డ

'' ఈ సమాజపు ఆశారేఖ వ్యక్తిలోని సత్ప్రవర్తనే'' - ఛానింగ్

'' నిజంగానే నిజంగానే నిఖిల లోకం హసిస్తుందా
దారుణ ద్వేషాగ్ని పెంచె దానవత్వం నశిస్తుందా''
''నిజంగానే నిఖిల లోకం నిండు హర్షం వహిస్తుందా ?
మానవాళికి నిజంగానే మంచి కాలం రహిస్తుందా ?''
సాధు సత్వపు సోదరత్వపు
సాధు తత్వం జయిస్తుందా ?'' - శ్రీ శ్రీ

రామకృష్ణ అన్నయ్య జిల్లెళ్ళమూడి జీవితం అతని బ్రతుకు దారిలో ఒక పెను మలుపు. అది అతని జీవితానికే ఒక మేలు కొలుపు. ఏనాడు కొండముది అన్నపూర్ణమ్మ గారు తన కుమారుణ్ని బ్రహ్మాండం అనసూయమ్మగారి చేతిలో పెట్టిందో ఆనాడే రామకృష్ణ జీవితం మారిపోయింది. అంత వరకు ''రామకృష్ణ మూర్తి''గా పిలువ బడిన వాడు ''రామకృష్ణ అన్నయ్య''గా మారిపోయాడు. అంత వరకు ఎందరో మహాను భావులు ఆ తల్లిని సేవించి తరించారు, కొలిచి కృతార్థులైయ్యారు. పొన్నూరు వాస్తవ్యులు, ప్రముఖ స్వాతంత్ర్య సమర యోధులు శ్రీ అధరాపురపు శేషగిరిరావు గారు ''అమ్మ'' సాన్నిధ్యంలో అనితర సాధ్యమైన కార్యక్రమాలకు పునాదులు వేశారు. ''అందరిల్లు'' భవన నిర్మాణం, ''మాతృశ్రీ'' ముద్రణాలయం, ''మాతృశ్రీ'' పత్రికల స్థాపన ఆయన చేతి చలువే. అదే విధంగా జిల్లెళ్లమూడికి రోడ్డు నిర్మాణం, ఆగ్రామానికి కనీస సౌకర్యాల కల్పన కూడా శేషగిరి రావుగారి భిక్షే. అధరాపురపు వారి ఆధ్వర్యంలో ''మాతృశ్రీ'' సంస్థలు దినదిన ప్రవర్ధమానం అవుతున్న సమయంలో శేషగిరి రావుగారికి అనారోగ్యం ఏర్పడటం ఆ స్థానాన్ని రామకృష్ణ గైకొనటం అనివార్యంగా జరిగిన సంఘటన. ఆ విధంగా అతి చిన్న వయస్సు 28 సంవత్సరాలలో రామకృష్ణ ఇంతటి బృహత్తరమైన విశ్వజననీ కుటుంబ బాధ్యతను స్వీకరించడం జరిగింది. జిల్లెళ్ళమూడి అమ్మ తన కన్న బిడ్డలు హైమ, సుబ్బారావు, రవిలతో పాటే రామకృష్ణ పైకూడా అపార వాత్సల్యం చూపింది. వాస్తవానికి అంతకు

మించిన మాతృప్రేమను అతనిపై కురిపించింది. అలాగే ''అమ్మ''కు పూజారిగా, ఆంతరంగిక కార్యదర్శిగా రామకృష్ణ ఆమె ఆంతర్యం ఎరిగి మసలుకునేవాడు. ఏ క్షణంలో కూడా ఏమరపాటు లేకుండా ఆమె కనుసన్నల్లో మెలిగేవాడు. ఎప్పుడు భక్తులు ఏ తెంచినా విసుగూ విరామం లేకుండా ''అమ్మ''దర్శన భాగ్యం కల్పించే వాడు. ''అమ్మ''కు నిత్య పూజారిగా కొబ్బరికాయ కొట్టడం దగ్గర నుండి కర్పూర హారతి ఇవ్వడం వరకు స్వయంగా చేసేవాడు. తానొవ్వక, ఇతరుల నొప్పించక భక్త కోటితో వ్యవహరించి క్లిష్ట సమయాలలో కూడా కార్యదక్షుడని నిరూపించుకున్నాడు. '' అమ్మ లక్షమందికి భోజనాలు పెట్టే చారిత్రిక ఘట్టం (సన్నివేశం), అమ్మపర్యటనలు, ఉత్సవాల నిర్వహణ, ఇత్యాది బహు క్లిష్ట సమయాల్లో ''అమ్మను కంటికి రెప్పలా చూసుకొని భక్త జనావళికి ఆశాభంగం కలుగకుండా, కార్యక్రమాలకు విఘాతం కలుగ కుండా నడిపించేవాడు ఎవరికి ఎలా ఎక్కడ ఎప్పుడు ''అమ్మ'' దర్శన భాగ్యం కలుగజేయాలో కూలంకుషంగా తెలిసిన వ్యక్తిగా ''అమ్మ'' ఆంతరంగిక కార్యదర్శి పదవికి నూటికి నూరుపాళ్ళు న్యాయం కలుగజేసే వాడు. ఇలా24 గంటలూ ''అమ్మ'' పాద సన్నిధిలోనే గడిపిన ధన్యజీవి అన్నయ్య. ఇలా ''అమ్మ'' అపార ప్రేమ వాత్సల్యాలందేందుకు సరైన వారసుడని నిరూపించుకున్నాడు రామకృష్ణ అన్నయ్య. అంతే కాదు అమ్మ దగ్గర నుండి అన్నయ్యకు ఎలాంటి ఆహ్వానం అందిందో తనేకాదు తన బంధు మిత్ర సపరివారంగా అమ్మకు సేవ చేసి తన జీవితంధన్యం చేసికొన్నాడు. తన తమ్ముడు కొండముది హనుమంతరావు, బావగార్లు బూదరాజు వెంకటరత్నం, లక్కరాజు హనుమంతరావు, బావమరుదులు బూదరాజు శేషగిరిరావు, నందిరాజు సుబ్బారావు, నందిరాజు రామారావు, నందిరాజు శ్రీనివాసరావు, మేనల్లుళ్ళు బూదరాజు మధుసూదనరావు, దుర్గాప్రసాదరావు, సుబ్రమణ్యశర్మ, శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ, శాంతారామ్, లక్కరాజు లాలా, పార్ధసారధి, కృష్ణమోహన్, హరిప్రసాద్, కృష్ణఫణి, బంధువులు కొండముది శ్రీ రామచంద్ర మూర్తి, కొండముది బాలగోపాల కృష్ణ మూర్తి, కొండముది దత్తాత్రేయ శర్మ, తురుమెళ్ళ చెన్నకేశవరావు, తురుమెళ్ళ గోపాల కృష్ణ మూర్తి, భట్టిప్రోలు చలపతి రావు భట్టి ప్రోలు రామచంద్ర, మిత్రులు యులవర్తి నరసింహారావు, నల్లమోతు సత్యనారాయణ కుర్రాఅంకినీడు, పరివారం షేక్ అల్లాబక్ష్, షేక్‌నబీ, షేక్ ఆదాం ఇలా అందర్ని ''అమ్మ'' సేవకు అంకితం చేసి తన జీవితంతో పాటు వారిజీవితాలని చరితార్ధం చేశాడు అన్నయ్య.

11 కార్యశీలుడైన మహాయోగి

"అమ్మ మహోన్నత హిమవచ్ఛృంగం
ఆ శృంగాన్ని సందిట పొదవుకున్న
మంచు శ్రీ రామకృష్ణ"

- శ్రీశ్రీశ్రీ లక్ష్మణ యతీంద్రులు

అమ్మ పాద కమలాలను నిత్యం అర్చించే పూజారి, శ్రీ కృష్ణునికి రాధ వంటి అమలిన భక్త శిఖామణి రామకృష్ణ అన్నయ్య. ఒక సొగసు, ఒక ఆకర్షణ, ఒక అనుగ్రహ దృష్టికల వ్యక్తి అతడు. అతని క్రియా కార్యకలాపాలు మనసుల్ని కరిగిస్తాయి. తన పనుల ద్వారా కవితావేశం, ధ్యానం, సమ్యక సదాలోచన కల్గించే అన్నయ్య ఎప్పుడూ సంతోషాంతరంగుడై, ప్రకాశవంతుడై, ఉజ్జ్వల భావ ప్రపూర్ణుడై కన్పిస్తాడు. ప్రతి క్రొత్త పర్యాటకుని, ఆశ్రమ సందర్శకుని తన మృదు భాషణతో అలరిస్తాడు. అతడు ఆ తల్లి చుట్టూనే తిరుగుతూ ఉండడంతో అతనిలోని ఆత్మాభిమానం, కించిత్ అహంకారం, పూర్తిగా రూపుమాసిపోయినవి. జిల్లెళ్ళమూడిలో పిపీలికాది బ్రహ్మపర్యంతం సాగే కార్యక్షేత్రం అతనిది. అందరికీ అన్ని కాలాలకూ సంబంధించిన పనులపై అతని మనస్సు నిమగ్నమై ఉంటుంది.

రామకృష్ణ అన్నయ్య విశ్రాంతి తీసుకునే సమయం, నిద్రా సమయం అతి స్వల్పం అనిపిస్తుంది. ఎప్పుడూ అతని కార్యభారం అనంతంగా ఉంటుంది. అతడు చేసే పని ఎక్కువ, తినేది, త్రాగేది తక్కువ. ఒకప్పుడు దృఢశరీరుడు నేడు దుర్బలుడైనాడు. నిత్యం చేసుకునే ఇంజక్షన్లే అతనికి ఆహారం, నేత్రావరోధం ఏర్పడినా అతి ప్రయాసతో కార్యనిర్వహణ సాగిస్తూనే ఉన్నాడు. కేవలం పిడికెడు మెతుకులు తిని అర్థాకలితో అంప శయ్యపై పరుండి నేత్రచికిత్స (రెండు నెలలపాటు) చేయించు కున్న ఘట్టం అసదృశం, అది వ్యాధి గ్రస్తులకు ఆదర్శంకాగా వైద్యులకు ఆశ్చర్య జనకమైన ఓ అంశం. రెండు కళ్ళు కనిపించక పోయినా మద్రాసులో శ్రీ చుండూరి అచ్యుత్ ఇంట్లో నేత్రవైద్యం చేయించుకుంటూ మనో దృష్టితో అమ్మను సందర్శిస్తూ అను నిత్యం

అమ్మ నామాన్ని లక్షలాది సార్లు జపం చేసి ఆ తల్లి అను గ్రహం సంపాదించుకున్నాడు. ''ఒక కన్ను, ఒక పెన్ను ఇవ్వమని'' ''అమ్మ''ను మనసారా కోరి అవి సాధించుకున్న అపర కాళిదాసు ఈ అన్నయ్య.

రెండు హస్తాలు, రెండు పాదాలు, రెండు కళ్ళు నిత్య జాగ్రుతాలై ఉండగా అప్పట్లో అపార కార్యభారాన్ని అలవోకగా మోసే వాడు. ఎప్పుడూ చిరునవ్వులు చిందులాడే మోముతో ప్రేమాదరణలకు ఆలవాలమైన తన రెండు చేతులు చాచి వేలాది భక్తులను ఆహ్వానించేవాడు. వారితో మృదుమధురంగా భాషించే వాడు. ఒకే ఒక్క చూపుతో ప్రతి ఒక్కరినీ పలకరించే వాడు, అలరించే వాడు, ఆకర్షించే వాడు. తన వ్రేలి కదలికలతో శాసించి పనులు జరిపించేవాడు. భక్తుల అవసరాలను అనుక్షణం గమనించేవాడు. వంటశాల పర్యవేక్షించే వాడు. స్టోరు గదిని పరిశీలించే వాడు, అమ్మతో మాట్లాడి, టెలిఫోను దగ్గరకు పరుగులు తీస్తుండే వాడు. భక్తులను క్రమ బద్ధంగా కూర్చుండ బెట్టి, అమ్మస్నానం, వస్త్ర ధారణ, వంటి ఏర్పాట్లు చూసేవాడు. అమ్మ దర్శనానికి భక్తుల్ని సంసిద్ధులను చేసేవాడు. అప్పుడు తన బిడ్డలకు అనుగ్రహ దర్శనం కల్గించమని అమ్మను వేడుకునే వాడు. వేదిక సిద్ధపరచి పూజా ద్రవ్యాలను, ప్రసాదాలను సన్నద్ధం చేసుకునేవాడు. అమ్మ అర్చనకు అవసరమైన అన్ని అంశాలను అతి శ్రద్ధతో సమకూర్చి పెట్టుకునే వాడు. కొబ్బరి కాయలు కొట్టుకునే వారి సౌకర్యం కోసం ఒక రాతిని, ఆ నీటిని పోసేందుకు ఒక పాత్రని కూడా సిద్ధం చేసేవాడు. తన స్నానం, వస్త్రధారణ క్షణంలో సగం సేపులో ముగించుకొని శుభ్రంగా, సుందరంగా తయారైవచ్చి అమ్మ పాదాల చెంత కూర్చునే వాడు. అమ్మ పాదాలను ఒక మెత్తని మెత్త(తలగడ)పై విశ్రాంతిగా నిలిపేవాడు. ఆ శిరీష మృదుల చరణాల నుండి పాదరక్షలు తొలగించి భక్తులు ప్రణామాలు అర్పించుకునే వీలు కల్గించేవాడు. వరూసిత అయిన అమ్మ చేలాంచనాలను సవరించి ఆ బంగారుచీర అంచులు ఆ మృదుపాదాలకు మరింత శోభ చేకూర్చే విధంగా అమర్చేవాడు. ఇక అక్కడ కొద్ది నిముషాలసేపు నిశ్శబ్దం అలముకునేది. ఈలోగా అన్ని సరిచూసుకునేవాడు. సర్వం సిద్ధమై పోగా అప్పుడప్పుడూ అమ్మ మోమును అనుగ్రహం కోసం వీక్షించేవాడు. అమ్మ కంటి కొసల నుండి ఏ తెంచిన ఆజ్ఞలను ఔదలదాల్చి భక్త కోటిని ఒకొక్కరినే ఆహ్వానించేవాడు. వారు అమ్మ ఎదుట కూర్చుని ఆమె పాదాలు

తాకి అర్చించే వీలు కల్పించేవాడు. భక్తుడు తెచ్చిన పూజా ద్రవ్యాలను తీసుకొనేందుకు ఒక పళ్ళెరము తన చేత దాల్చి సిద్ధంగా ఉండే వాడు. అప్పుడు అమ్మ వాటిని తాకి ఆశీర్వదించి తిరిగి భక్తులకు ఇవ్వటం జరిగేది.

ఇలా ఐదు ఆరు పనులు ఏక కాలంలో కేవలం తనకున్న రెండు చేతులతో నిర్వహించే వాడు. ఒక చేతితో కుంకుమ పొట్లాలు, కొబ్బరి చిప్పలు తీసికొని, కర్పూరం వెలిగించమని భక్తులకు అందించి మరో చేతితో అక్కడ నిర్మాల్యాలను తొలగించి శుభ్రంచేసేవాడు. అమ్మను చూడవచ్చే వారి ఊరు పేరూ అడిగి భోజనం చేశారా అని ప్రేమతో ప్రశ్నించే వాడు. ఈవిధంగా క్రమ బద్ధంగా ఒకరి తర్వాత ఒకరు భక్తులు మర్యాదతో, సత్ప్రవర్తనతో అమ్మనుదర్శించేందుకు దోహదం చేసేవాడు. వారిని ప్రేమతో, చిరునవ్వుతో సాగనంపేవాడు. సుదీర్ఘ కాలం సాష్టాంగ దండ ప్రణామాలు చేసే భక్తుల పట్ల ఓరిమి వహించేవాడు. ఆ తల్లి పాదాలచెంత ఉంచిన ప్రసాదాలను భక్తుల చేతిలో పెట్టి సమాశ్వాసన కల్గించేవాడు. అమ్మతో సంభాషించాలని అభిలషించే భక్తుని కోర్కెను అమ్మ ముందు పెట్టి ఆమె అనుజ్ఞ కోసం ఎదురు చూసేవాడు. ఒకోసారి ఆ భక్తుని వేదన, నివేదన అతనే ఆలకించేవాడు. జనం ఎక్కువైనప్పుడు కొంతసేపు ఓపిక పట్టమని, అందరికి దర్శనం కలిగిస్తామని చెప్పి సాదరంగా అర్థించేవాడు. ఈ విధంగా ఏక కాలంలో నిర్వహించబడిన అనేక పనులు క్రమ బద్ధంగా స్వభావ సుందరంగా అతడు నిర్వహించేవాడు. ఇంత సునిశితంగా ఏ పొరపాటు లేకుండా, తొట్రుపాటు పడకుండా పనులు జరపటం కేవలం అమ్మకు మాత్రమే సాధ్యమౌతుంది. అన్ని సమయాల్లో అతడు నిస్వార్థంగా కేవలం అమ్మ- ఆపరిసరాల పట్ల మాత్రమే దృష్టి కలిగి కన్పించే వాడు.

ఈ దివ్య సౌందర్య మహిమ ఆదృష్టితో చూసేవారి కళ్ళకు మాత్రమే కన్పిస్తుంది. సాధారణంగా అనేక తప్పిదాలు చేస్తూ వ్యక్తులు తమ హోదాకు లోటు కలిగేలా జారిపడిపోతారు. చేతకాక దొంగ చూపులు చూస్తారు. కాని విశుద్ధమై, నిస్వార్థమై, కళంకరహితమై నిత్యోత్సాహమైన సోమరితనం లేని ఈ యోగిచర్యలు ప్రేమ అనే ఒక అదృష్ట చలనం ద్వారా ఆవరణాన్ని యావత్తు ఊడ్చివేస్తాయి. ఈ విధంగా వివిధ చిన్నా పెద్దా పనులను సంపూర్తిగా, సమృద్ధిగా నిర్వహించి సంతృప్తితో, సంతుష్టితో అతడు

అమ్మకు హారతి ఇవ్వటంతో ఆనాటి దర్శన కార్యక్రమం సమాప్తమౌతుంది. అతడు తిరిగి పాదరక్షలు అమ్మకు భద్రంగా తొడిగి ఆ త్రోవను శుభ్రపరచి ఆమెను తన నివాసానికి (గది) తీసుకు పోతాడు. ఒక నీడ వలె, అడుగు జాడ వలె ఆమెతో కలిసి ఆ గదిలోకి అడుగు పెడతాడు. ఈ విధంగా ఒక ఒంటరి- ఏకైక-వ్యక్తి-తన సర్వస్వం ఆ తల్లికే సమర్పించిన వ్యక్తి, ఆమె దివ్య సన్నిధిలో రోజంతా గడిపే వ్యక్తి, ఒక స్వార్ధ రహితుడైన వ్యక్తి. పేదైనా, ధనికుడైనా అందరినీ ఒకే విధంగా చూసే వ్యక్తి, అందరినీ చిరునవ్వుతో ఆదరించే వ్యక్తి,- అక్కడి వందలాది చిన్నాచితక పనులతో పాటు కొండలవంటి పెను భారాన్ని సైతం ఒకే సారి తన భుజస్కంధాలపై మోస్తుంటాడు.

ఈ విధంగా జిల్లెళ్ళమూడిలో అమ్మ శ్రీచరణ మందారాల సమక్షంలో ఒక కార్యశీలుడైన మహాయోగి సాక్షాత్కరిస్తాడు. ఇక్కడ నటన కానీ, నటుడు కానీ కన్పించడు. కాని ఒక వ్యక్తి కార్యనిర్వహణాదక్షత కనిపించక మానదు. ఇటువంటి అనితర సాధ్యమైన కార్యక్రమం నిర్వహించడం అహంకార రహితునికే సాధ్యం, అమ్మ ఆశీఫలం పొందిన వారికే సాధ్యం. ఇటువంటి కార్యక్రమాలు వీక్షించటం కంటికి విందు, మనసుకు పసందు కలిగిస్తుంది. ఇంతకంటే మహాయోగం మరొకటి ఉన్నదా? (''మాతృశ్రీ'' 1973 సెప్టెంబరు సంచికలో శ్రీ U. పార్ధసారధి వ్రాసిన ఆంగ్ల వ్యాసం **"A Maha Yogi in Action"** కు స్వేచ్ఛానువాదం).

-)o(-

అమ్మలోనే ముగ్గురమ్మలు
సూర్యచంద్రులు అమ్మ కమ్మలు - అన్నయ్య

అమ్మ బోధలు వేదవిహితం
అమ్మ గాథలు ప్రేమ భరితం - అన్నయ్య

అమ్మ దీవెన సర్వ శుభదం
అమ్మ వీక్షణ సుధాజలదం - అన్నయ్య

అమ్మ నెన్నడు మరువకూ !
అమ్మ పదములు వదలకూ ! - అన్నయ్య

12 ప్రజ్ఞ

''ధీరుల్ విఘ్న నిహన్యమానులగుచున్
ధృత్యున్నతోత్సాహులై ప్రారబ్ధార్థము
లుజ్జగింపరు సుమీ ప్రజ్ఞానిధుల్ గావునన్''

''అమ్మా ! సామాన్య మైన కుటుంబాలలోనే జరగటం కష్టంగా ఉంది అట్లాం టప్పుడు ఇక్కడ ఎట్లా జరుగుతుంది అనేది ఊహించుకుంటేనే ఏమిటోగా ఉంటుంది'' అనే భక్తుని సందేహానికి జిల్లెళ్ళమూడి 'అమ్మ' ఇచ్చిన సమాధానం ఇది: -

''దీన్ని గురించి ఆలోచించ పని లేదు. అంటే అంతటా పెట్టేది నేనైనప్పుడు ఇక్కడి గురించి ఆలోచనే లేదు. ఉండగలిగితే ఎన్నాళ్ళయినా ఉండవచ్చు. భోజనానికి ఇబ్బంది లేదు''. అలా అమ్మ వెలిగించిన గాడి పొయ్యి ఇన్నేళ్ళుగా అఖండంగా వెలుగుతూనే ఉన్నది. వేలాదిగా భక్తులు 'అమ్మ' ప్రసాదం తీసుకుని వెళుతూనే ఉన్నారు. అక్కడ ప్రతి రోజు రెండు వందల మందికి తక్కువ లేకుండా అతిథి, అభ్యాగతులు భోజనం చేస్తుంటారు. వీరు కాక ఆవరణలో స్థిర నివాసం చేస్తున్నవారు, మాతృశ్రీ విద్యాలయాల్లో చదువుకుంటున్నావారు మరో మూడు వందల మంది రెండు వేళలా భోజనం చేస్తారు. జిల్లెళ్ళమూడి ''అమ్మ'' డొక్కా సీతమ్మ, మంగళగిరి బాలాంబల వలె నిరతాన్నదానం తన జీవిత ధ్యేయంగా ఈ గాడి పోయ్యి వెలిగించి ''అందరిల్లు'' స్థాపించిందేమో. అమ్మ అపార యోగ శక్తి, అపూర్వ సంకల్ప బలం ఈ నిరంతర అన్నదాన యజ్ఞాన్ని నిర్విఘ్నంగా కొనసాగింప జేస్తున్నా యేమో ! అమ్మ దగ్గర నిక్షేపాలు ఏమీ లేవు. పెట్టుబడి ధనరాసు లేవీ లేవు. నిల్వడబ్బుగాని, నిల్వధాన్యంగాని లేవు. అయినా ఆ తల్లి సాక్షాత్ యోగీశ్వరేశ్వరి, అన్న పూర్ణేశ్వరి కనుక అన్నదానం కుంటు పడకుండా ఇన్నేళ్ళూ సాగిపోయింది. కాని కాలచక్ర భ్రమణంలో ''అమ్మ'' భౌతికంగా కనుమరుగై పోయింది. అమ్మ అన్నపూర్ణాలయ నిర్వహణకు అందించిన ఆర్థిక సంపద ఏమీ లేదు అమ్మ రామకృష్ణ అన్నయ్యకు

అందించిన అమృత సందేశం తప్ప (11-6-1985న రాత్రి రామకృష్ణతో చెప్పిన మాటలు) ఆ సందేశం ఇలా ఉన్నది. ''మిమ్మల్ని వదిలి నేను మాత్రం ఎక్కడకు పోతానురా ? నేను మీతోనే ఉంటాను. మీకు కనపడక పోవచ్చును గానీ ఎప్పుడులానే మిమ్మల్ని నేను చూసుకోనూ ? బిడ్డలయోగ క్షేమాలు చూసుకోవడం తల్లి ధర్మం. అన్నపూర్ణాలయం, విద్యాలయాలు, వైద్యాలయాలు, దేవాలయాలు అన్నిటినీ యధావిధిగా కొనసాగించండి. నేను కనపడను అని దుఃఖపడకండి. అవసరమయి నప్పుడల్లా కనిపిస్తాను''. అయితే అమ్మ మన మధ్య జీవించి నడయాడి నప్పుడే వదాన్యుల విరాళాల మీద సంస్థ నిర్వహించ వలసి వచ్చేది. అమ్మ సూచనల ప్రకారం రామకృష్ణ అన్నయ్య తదితర సోదరులు విరాళాలు సేకరించి సంస్థను నిర్వహించటం జరిగేది. హైమాలయం, వైద్యాలయం, వాత్సల్యాలయం, విద్యాలయం అన్ని మూల ధనం లేని సంస్థలే, అన్నీ భక్త జన సహాయంతో నడిచే సంస్థలే. వీటిని నిర్వహించటం ఒక అసిధారా వ్రతం. కొన్నేళ్ళ పాటు అమ్మ భౌతికంగా మనల్ని వీడిన తరువాత ఈ సంస్థలను నిర్వహించేవారు ఆర్థిక ఇబ్బందుల్ని తట్టుకో లేక ''అమ్మ'' ఆశయం సంపూర్తిగా నిర్వహించ లేక పోవటం జరిగింది.

రామకృష్ణ అన్నయ్య శ్రీ విశ్వజననీ పరిషత్, మాతృశ్రీ విద్యాపరిషత్‌ల ఆధ్వర్యం స్వీకరించిన తరువాత అమ్మ ఆశయాలకు అనుగుణంగా సంస్థలు మళ్ళీ నడుస్తున్నాయి. గ్రామ గ్రామాలు పర్యటించి అమ్మ ఆశయాలు వివరించి ధాన్య రూపేణ, ధనరూపేణ విరాళాలు వసూలు చేసి ఈ సంస్థలను నిర్విఘ్నంగా నడపటం రామకృష్ణ అన్నయ్య ప్రజ్ఞకు నిదర్శనం. ధాన్యాభిషేకం దీనిలో ఒక భాగం. మాతృశ్రీ సంస్కృతకళాశాలకు సువిశాల భవన సముదాయం నిర్మించ గలగటం అన్నయ్య కార్యదక్షతకు మచ్చుతునక. ఈ భవనానికి ''శ్రీకొండముది రామకృష్ణ భవనములు'' అని నామకరణం చేయుటం ఎంతో సముచితము, ఇదే విధంగా (గోపూజ) ''గోమేధికోత్సవం'' వంటి సరికొత్త సంబరాలు జరపటం అన్నయ్య ఆలోచనా విధానానికి సజీవ తార్కాణాలు. అమ్మ సంస్థల్ని సామాన్య ప్రజలకు చేరువ చేయటంలో అన్నయ్య విజయం సాధించాడు. ఈ 'అన్నయాగం' లో తాము పాలుపంచు కొన్నారు

సోదరులు రావి నూతల రాయచంద్రరావు, ఏకా రాజేశ్వర రావు, కోన వెంకటేశ్వర రావు, తురువెళ్ళ చెన్న కేశవ రావు, కోగంటి సత్య ప్రసాదు, కట్టమూరి వెంకటేశ్వర రావు, **T.T.** అప్పా రావు, కస్తూరి వెంకటరమణ మూర్తి, కొండూరి శేషయ్యలింగం, కొండెపూడి సూర్యనారాయణ, కోన సత్యనారాయణ, లక్కరాజు సత్యనారాయణ, నేరెళ్ళ సుబ్బారావు. అన్నయ్య అంటె అపారవాత్సల్యం చూపించారు బ్రహ్మాండ వసుంధర, కొండూరి శేషయ్యలింగం గారి అమ్మాయి రాణి అక్కయ్య, ఉప్పల వరలక్ష్మి. అందుకే పెద్దలు ఇలా అంటున్నారు :

''వాడు అప్పికట్లకు కరణం నాకు ఉపకరణం'' - **జిల్లెళ్ళమూడి అమ్మ**

''జిల్లెళ్ళమూడి అమ్మ తన ప్రతినిధిగా,
ప్రతీకగా కొండముది రామకృష్ణను నిలిపింది''

- **శ్రీశ్రీశ్రీ విశ్వయోగి విశ్వంజీ**

-) ○ (-

అమ్మ సేవను మానకూ !
అమ్మ సన్నిధి వీడకూ ! - అన్నయ్య

అమ్మ తేజము అగ్ని తేజము
అమ్మ రూపము గగనకుసుమము - అన్నయ్య

మానవ మాధవి కూడిక హైమ
మానవ జాతికి కానుక హైమ - అన్నయ్య

నాచిరునామా - అమ్మ చరణాలు
అమ్మ చరణాలేకదా - కలికల్మష హరణాలు - అన్నయ్య

అమ్మా..
నాహృదయ రథముపై నీవున్న చాలు
నాతనువు నామనస్సు నీ కిచ్చుకుంటా - అన్నయ్య

13 అర్చన

''జీవితంలోని మొదటి నలభై సంవత్సరాలు ఒక గ్రంథం
ఆ తర్వాత ముప్పై పళ్ళు ఒక వ్యాఖ్యానం''

- షాపెన్ హా

రామకృష్ణమూర్తి అమ్మ అంతేవాసిగా, పూజారిగా, ఆంతరంగిక కార్యదర్శిగా సేవచేస్తూ ''రహి''గా, రామకృష్ణగా రూపాంతరం చెందాడని ముందే చెప్పాను. అమ్మ పరిపూర్ణ కటాక్షం వల్ల ఆనందాబ్ధిలో సుమనౌకగా రెండు పుష్కరాలు విహరించాడు. అమ్మ భౌతికంగా అదృశ్యమైన తరువాత అతనిలో తరగని దుఃఖం చెలరేగింది. బ్రతుకు పునాది కదిలింది. అప్పుడు ఒక విచికిత్స ప్రారంభమైంది. అమ్మను పూజించడానికి అమ్మ శరీరం ఆధారం అయినట్లే, 'అమ్మ స్థాపించిన సంస్థలే 'అమ్మ' పూజకు ప్రతీకలనే భావం మదిలో మెదిలింది. అతనిలో అమృత వర్షం కురిసింది. అప్పటికే మాతృశ్రీ విద్యాపరిషత్ నిర్వహణ చేతికొచ్చింది. అజ్ఞానాంధకారాన్ని పారద్రోలే అమృత విద్య అందించాలనే లక్ష్యంతో 29 సంవత్సరాల క్రిందట మాతృశ్రీ విద్యాసంస్థల స్థాపనకు అంకురార్పణ జరిగింది. 1970లో మాతృశ్రీ విద్యాపరిషత్, 1971లో మాతృశ్రీ ఓరియంటల్ కాలేజీ, 1977లో మాతృశ్రీ సంస్కృత పాఠశాల నెలకొల్పబడ్డాయి. అమ్మ అమృతహస్తాల ఆశీస్సులతో ప్రారంభమైన విద్యాపరిషత్ అనేక మంది వదాన్యుల భూరి విరాళాలతో, అవ్యాజ ఆదరణతో విజయ వంతంగా నడిచింది. ఉచిత విద్యతో పాటు ఉచిత భోజన నివాసవసతి కూడా కల్పించబడింది. ఇక్కడి అధ్యాపక వర్గం శ్రీయుతులు విఠాలరామచంద్రమూర్తి, సత్యనారాయణ మూర్తి, మధుసూదన శర్మ, కుమారశర్మ, ప్రసన్నాంజనేయ శర్మ, హనుమ బాబు, కళాశాల ప్రిన్సిపాల్ శ్రీ పన్నాల రాధాకృష్ణ శర్మ గారి ఆధ్వర్యంలో ఉదాత్త సేవా నిరతితో తమ కర్తవ్య నిర్వహణ కొనసాగిస్తూ వచ్చారు. ఇక్కడి విద్యార్థి బృందం ప్రతి ఏడు నూటికి నూరు శాతం ఉత్తీర్ణత సాధించటంతో పాటు రాష్ట్రస్థాయిలో, జాతీయ స్థాయిలో, విశ్వవిద్యాలయ స్థాయిలో స్వర్ణ పతకాలు అందుకున్నారు. అమ్మ అనుగ్రహంతో ఎక్కడికెళ్ళినా అఖండ విజయాలు సాధించుకొని ప్రథమ బహుకృతులు అందుకొని తిరిగి వచ్చారు. శారదా

దరహాస చంద్రికలుగా వెలిగారు చిరంజీవులు పోతుకూచి ఝాన్సీ లక్ష్మీ బాయి, శిష్టి లక్ష్మీ నరసింహమూర్తి, లక్ష్మీ సుగుణ, ఈమని కాళికేశ్వర శర్మ, కొమరవోలు రవి, గరుడాద్రి సుభాషిణి, ధూళిపాళ మోహనశంకర్, మాజేటి రామకృష్ణ. రెండు దశాబ్దాలు పైబడిన ఈ ఉత్తమ శ్రేణి విద్యాసంస్థల బాధ్యత రామకృష్ణ అన్నయ్య ఒక నిష్కామ కర్మగా ఒక ధర్మ దీక్షగా త్రికరణ శుద్ధితో దీనికే అంకితమై నిర్వహించటం జరిగింది.

ఈ శారదార్చన ద్వారా రామకృష్ణ అన్నయ్య జీవితంలో మరో మెట్టు అధిరోహించాడు. ''అమ్మకు'' ప్రతి రూపం ''అమ్మ'' స్థాపించిన ప్రతి సంస్థ. ''అమ్మ'' సంస్థను సేవిస్తే వాంఛితార్థ ప్రదాయిని, జీవజలధి అయిన అమ్మను సేవించినట్లే. విద్యాపరిషత్ నిర్వహణకై అన్నయ్యకు అభినందన మందార మాల అందించింది ఆర్షజగతి.

-)o(-

అమ్మా!
నాకున్న సర్వము నీ కిచ్చివేసీ
శూన్యమై శుద్ధమై నే మిగిలి పోతా - అన్నయ్య
ఈ షోడశ దివ్య కళలకూ మానవరూపమే - అమ్మ
మానవ శరీరంలో శోభిల్లే మాధవత్వమే - అమ్మ - అన్నయ్య
హైమమ్మా!
అమ్మ ఒడిలో పైడి బొమ్మవు
గర్భగుడిలో మరో అమ్మవు
విశ్వమంతకు - కంటి చెమ్మవు
కల్ప తరువుకు - పూల కొమ్మవు - అన్నయ్య
అమ్మా!
నీ రూపే లోకాలకు మణిదీపం
నిను చూడక జీవించుట మహాపాపం - అన్నయ్య
రచనే నా అర్చన - అన్నయ్య

14 సన్మాన పరంపర

రామకృష్ణ అన్నయ్య అందుకున్న సన్మాన సత్కారాలు ఎన్నో! ఎన్నెన్నో! ''వాడు అప్పికట్లకు కరణం. నాకు ఉపకరణం'' అని అమ్మ చేత ప్రశంసలు పొందటం అన్నింటికన్నా పెద్ద సన్మానం. ''వాడు అర్చక స్థానంలో ఉంటె అది శివపూజ లేకుంటె అది శివపూజ'' అన్న అమ్మ మెచ్చుకోలు అన్నయ్య అందుకున్న ఘనసత్కారము. పూజారిగా అన్నయ్య భగవంతుణ్ణే మెప్పించాడు.

'అమ్మ వజ్రోత్సవసభలో ప్రొఫెసర్ కృష్ణశాస్త్రిగారు ప్రసంగిస్తూ ''బాపట్లలో రైలు దిగిన వెంటనే మాతృశ్రీ ప్రెస్‌లో విచారిస్తాను అన్నయ్యు జిల్లెళ్ళమూడిలో ఉన్నాడా? లేడా ? అని. అన్నయ్య ఉన్నాడు అంటె నాకు తృప్తి. లేడంటే అయ్యో! అని బాధపడ్తాను. అన్నయ్య సారథ్యంలో అమ్మ దర్శనం కల్గించే తృప్తి వేరు. అది అనుభవైకసాధ్యం'' అన్నారు. ఇలా భక్తులచేత ఆదరించబడటం అన్నయ్య పొందిన అత్యున్నత పురస్కారం.

8-3-1992న అన్నయ్యకు మాతృశ్రీ విద్యాపరిషత్‌వారు ఘనసన్మానం చేశారు. ఆసభలో శ్రీశ్రీశ్రీ లక్ష్మణయతీంద్రులు, శ్రీశ్రీశ్రీ విశ్వయోగి విశ్వంజీ మహరాజ్, మాష్టర్ మోపిదేవికృష్ణ స్వామి మొదలగు సిద్ధపురుషులు, యోగులు అన్నయ్యను అనేకవిధాల ఆశీఃపూర్వక ప్రశంసలు చేశారు. ఆనాటిసభలో జరిగిన విశేషాలను వివిధపత్రికలు ఈ విధంగా ప్రచురించాయి.

'అమ్మ' ఆశయాల వ్యాప్తికి వ్యవస్థగా కృషిచేశారు

బాపట్ల మార్చి 10 : మాతృశ్రీ విద్యాపరిషత్,జిల్లెళ్ళమూడి, ఆధ్వర్యంలో జిల్లెళ్ళ మూడి గ్రామంలో ఆదివారంనాడు గతముప్పది సంవత్సరాలుగా శ్రీజిల్లెళ్ళమూడి అమ్మను, అమ్మ స్థాపించిన పలు సంస్థలనుఅవిచ్ఛిన్నంగా నిర్వహిస్తున్న శ్రీకొండముది రామకృష్ణ అన్నయ్యను ఘనంగా సన్మానించారు. ఆ సందర్భంగా జరిగిన సభకు మాతృశ్రీ విద్యాపరిషత్ అధ్యక్షులు శ్రీ రావినూతల రామచంద్రరావు అధ్యక్షత వహిస్తూ, జిల్లెళ్ళమూడిలో నెలకొల్పిన విశ్వజననీ పరిషత్, మాతృశ్రీ విద్యాపరిషత్‌ల

అభివృద్ధికి ఎనలేని కృషిచేశారని, శ్రీరామకృష్ణ ఒక వ్యక్తిగా కాక అమ్మ అనుంగుబిడ్డగా అమ్మ ఆశయాల వ్యాప్తికి ఒక వ్యవస్థగా కృషి సల్పారని అన్నారు.

మాతృశ్రీ ప్రాచ్యకళాశాల తెలుగు శాఖాధ్యక్షురాలు, సన్మాన సంఘ కన్వీనర్ డాక్టర్ ఉప్పల వరలక్ష్మి తొలుత ఆహూతులకు స్వాగతం పలికి శ్రీ కొండముది రామకృష్ణ మాతృశ్రీసంస్థలకు చేసిన సేవలను గూర్చి వివరించారు.

శ్రీ విశ్వయోగి విశ్వంజీ జ్యోతిని వెలిగించి సభా కార్యక్రమాలను ప్రారంభించారు.

తదనంతరం శ్రీ కొండముది రామకృష్ణ రచించిన శ్రీ చరణ వైభవం అను ఆధ్యాత్మిక వచన కావ్యాన్ని శ్రీ విశ్వంజీ ఆవిష్కరించారు.

డాక్టర్ ప్రసాదరాయ కులపతి శ్రీచరణ వైభవ గ్రంధాన్ని గూర్చి ప్రసంగిస్తూ జిల్లెళ్ళమూడి అమ్మ గాయత్రిగాను, రాజరాజేశ్వరిగాను, సర్వ లోకములకు తన ప్రేమ తత్వంతో మాతృత్వం వహించారని ఆమె సేవలో గత 35 సంవత్సరాలుగా అంకితమైన శ్రీ రామకృష్ణకు మినహా అమ్మను గూర్చి చెప్పగల స్థోమత మరెవ్వరికి లేదని అన్నారు.

శ్రీచరణ వైభవంలో శ్రీ రామకృష్ణ అమ్మలో గల సర్వతత్వములను గ్రహించి సర్వజగత్తుకు అమ్మతత్వాన్ని ప్రబోధించారని అన్నారు.

మాతృశ్రీ విద్యాపరిషత్ కార్యవర్గ సభ్యులు శ్రీ తుమ్మలపల్లి హనుమంతరావు మొదటి ప్రతిని శ్రీ విశ్వంజీ నుండి స్వీకరించారు.

శ్రీరామకృష్ణ రచించిన మరియొక గ్రంథం ''వాత్సల్య గంగ'' అమ్మ పాటల సంపుటిని ఆంధ్రప్రభ మాజీ సంపాదకులు శ్రీ పొత్తూరి వెంకటేశ్వరరావు ఆవిష్కరించారు.

వాత్సల్య గంగ సంపుటి ప్రాశస్త్యాన్ని గూర్చి మాతృశ్రీ విద్యాపరిషత్ కరస్పాండెంట్ శ్రీ ఏకా రాజేశ్వరరావు పరిచయం చేస్తూ అమ్మ తత్వాన్ని ప్రబోధించే 81 పాటలు గ్రంథనంలో పొందుపరిచారని అన్నారు.

శ్రీమతి పి. నిర్మల, కుమారి డాక్టర్ పి. ఝాన్సీలక్ష్మీబాయిలు వాత్సల్య గంగ గ్రంథంలోని పాటలను శ్రావ్యంగా గానం చేసి శ్రోతలను ఓలలాడించారు.

వాత్సల్య గంగ మొదటి ప్రతిని మాతృశ్రీ విద్యాపరిషత్ కార్యవర్గ సభ్యులు శ్రీ ఉపద్రష్ట మధుసూదనరావు శ్రీ పొత్తూరి వెంకటేశ్వర రావు నుండి స్వీకరించారు.

తదనంతరం జరిగిన శ్రీ కొండముది రామకృష్ణ, ఆయన సతీమణి శ్రీమతి పద్మావతుల సన్మాన సభలో శ్రీ విశ్వంజీ రామకృష్ణ దంపతులను పూలమాలాలం కృతుల గావించి, దుశ్శాలువలు, నూతన వస్త్రాలు బహూకరించి సత్కరించి ఆశీర్వదించారు.

సన్మాన సభలో పెదముత్తేవి ముముక్షు పీఠాధిపతులు శ్రీ లక్ష్మణ యతీంద్రులు ప్రసంగిస్తూ అమ్మ అనుగ్రహానికి పాత్రుడైన శ్రీ రామకృష్ణను సన్మానించడం తమ కెంతో ఆనంద దాయకమని, అమ్మ లేదనడం సరైనదికాదని, అమ్మ వాత్సల్యం, ఆమె తత్వం సర్వవ్యాపితంగా ఉన్నదని, సర్వసృష్టిలో అమ్మను దర్శించిన రామకృష్ణ అన్నయ్య, రామకృష్ణ అయ్యగా మన మధ్య ఉన్నాడని రామకృష్ణ తన జీవితాన్ని అమ్మ సన్నిధిలో కర్పూరంలా వెలిగించి అమ్మ వాత్సల్యాన్ని కర్పూర హారతిలా మానవాళికి అందించిన మహా వ్యక్తి అని, అమ్మ తత్వాన్ని సర్వ ప్రపంచానికి ప్రచారం చేసే విషయంలో సర్వకాలాలు కృషి సల్పాలని ఆశీర్వదించారు.

శ్రీ మోపిదేవి కృష్ణస్వామి ప్రసంగిస్తూ, శ్రీ రామకృష్ణను సన్మానించడం సత్కార్యంగా అభివర్ణించారు. శ్రీ రామకృష్ణ సత్కారంతో జిల్లెళ్ళమూడి కథ ఒక మలుపు తిరిగిందని అంటూ, అమ్మ రామకృష్ణ అన్నయ్య రూపంలో మన మధ్య ఉన్నదని అన్నారు.

శ్రీ విశ్వయోగి విశ్వంజీ మాట్లాడుతూ, అమ్మ జీవిత సత్యాలను పరిశోధించి, పరిశోధకుడుగా శ్రీ రామకృష్ణ అమ్మతత్వాన్ని గ్రంథరూపంలో అందించిన పరిశోధకుడని అన్నారు. విశ్వమాత అమ్మ తత్వాన్ని ఆదర్శంగా తీసుకొని ఈ ర్ష్య, ద్వేషాలకు అతీతంగా సర్వ మానవ సౌభ్రాతృత్వాన్తో మానవాళి పునీతులు కావాలని అన్నారు. మానవుడు మాయ నుండి మేల్కొని, అరిషడ్వర్గాల నుండి బయటపడి అమ్మ లక్ష్యాన్ని, ధ్యేయాన్ని నెరవేర్చాలని అన్నారు. అమ్మ పభోధించిన దేవుడొక్కడే, ఏ కులమైనా, ఏ మతమైన మానవులందరూ ఒక్కటేననీ మానవులంతా సమైక్యంగా నిశ్చల భావంతో మెలిగి ప్రపంచ శాంతిని పరిరక్షించాలని అన్నారు.

శ్రీ విశ్వయోగి విశ్వంజీని శ్రీ లక్ష్మణ యతీంద్రులవారు, శ్రీ లక్ష్మణ యతీంద్రులవారిని శ్రీ విశ్వంజీ నూతన వస్త్రాలతో సత్కరించారు.

సభలో పాల్గొన్న శ్రీ మోపి దేవి కృష్ణస్వామి, శ్రీ ఎ.వి.వి. ప్రసాద్, కె.వి. సత్యనారాయణాచార్యులను దుశ్శాలువలతోను, నూతన వస్త్రాలతోను సత్కరించారు.

మాతృశ్రీ విద్యాపరిషత్, విశ్వజననీ పరిషత్‌ల అభివృద్ధి కోసం శ్రీ కొండముది చేస్తున్న సేవలను గూర్చి అమ్మతత్వ ప్రచారానికి చేస్తున్న కృషిని గూర్చి, ఆయన వ్రాసిన శ్రీ చరణ వైభవం, వాత్సల్య గంగా గ్రంథాలను గూర్చి తిరుపతి సంస్కృత కళాశాల అధ్యాపకులు డాక్టర్ పన్నాల రాధాకృష్ణ శర్మ, శ్రీ టి.టి. అప్పారావు, శ్రీ బోపూడి రామబ్రహ్మంలు ప్రసంగించారు. **ఆంధ్రప్రభ : 11-3-92**

విశ్వశాంతికి అందరికృషి అవసరం

బాపట్ల, మార్చి 10 (టెలిన్యూస్) : మనిషికి మించిన దైవం లేదు, మనసుకు మించిన శక్తి లేదని, విశ్వశాంతికి ప్రతి ఒక్కరు కృషిచేయాలని శ్రీశ్రీశ్రీ విశ్వయోగి విశ్వంజీ అన్నారు. ఆదివారం రాత్రి బాపట్ల మండలం జిల్లెళ్ళమూడి గ్రామంలో శ్రీ రామకృష్ణన్నయ్య సన్మాన సభలో పాల్గొని ప్రసంగించారు. ఏ మతమైనా ఏకులమైనా ఏ పేరుతో పిలిచినా దేవుడొక్కడేనన్నారు. ఈ సభకు శ్రీ రావినూతల రామచంద్రరావు అధ్యక్షత వహించారు. శ్రీ కొండముది రామకృష్ణన్నయ్య రచించిన శ్రీ చరణ వైభవం (ఆధ్యాత్మిక వచన కావ్యం)ను విశ్వయోగి విశ్వంజీ ఆవిష్కరింపగా డాక్టర్ ప్రసాద్ రాయకులపతి కావ్యపరిచయం చేశారు. మొదటి ప్రతిని శ్రీ తుమ్మలపల్లి హనుమంతరావు గ్రహించారు. వాత్సల్యగంగ (అమ్మ పాటల సంపుటి)ను ఆంధ్రప్రభ మాజీ సంపాదకులు శ్రీ పొత్తూరి వెంకటేశ్వర రావు అవిష్కరింపగా శ్రీ ఏకా రాజేశ్వరరావు గ్రంథపరిచయం చేశారు. గానకోకిల శ్రీమతి పి. నిర్మల పాటలను విన్పించారు. శ్రీ నేరెళ్ళ సుబ్బారావు మొదటి ప్రతిని గ్రహించారు. ఈ సభలో శ్రీశ్రీశ్రీ లక్ష్మణ యతీంద్రులు ప్రసంగిస్తూ శ్రీ రామకృష్ణగత 30 సంవత్సరాలుగా అమ్మ సన్నిధిలో ఉంటూ తన జీవితానికి ధన్యత చేకూర్చుకొని, అమ్మ లేని లోటును తీరుస్తూ తానే చిన్నమ్మగా అయ్యారన్నారు. మాస్టర్‌మోపి దేవి కృష్ణస్వామి, జ్యోతిష్య

శాస్త్రవేత్త మాస్టర్ ఎ. వి. వి. ప్రసాద్ రావు, డాక్టర్ పన్నాల రాధాకృష్ణ శర్మ తదితరులు ప్రసంగించారు. అనంతరం శ్రీ కొండముది రామకృష్ణ, శ్రీమతి పద్మావతి రామకృష్ణ లకు ఘన సన్మానం జరిపారు. మాతృశ్రీ ప్రాచ్య కళాశాల తెలుగు శాఖాధ్యక్షురాలు శ్రీమతి ఉప్పల వరలక్ష్మి స్వాగతం పలుకగా సభాసామ్రాట్ డాక్టర్ కె. వి. యస్. ఆచార్య సభను నిర్వహించారు. ఉదయం : **11-3-92**

"శ్రీచరణ వైభవం" ఆవిష్కరణ

బాపట్ల మార్చి **9 (స్పాట్ న్యూస్)** : 'అమ్మ' చరణ సన్నిధిలో తన జీవితాన్ని కర్పూరంలా వెలిగించిన వ్యక్తి కొండముది రామకృష్ణ అని, ఆయన జీవితం ఆరిపోని దివ్యహారతిలా వెలుగొందుతున్నదని శ్రీ లక్ష్మణ యతీంద్రుల వారు అన్నారు. ఆదివారం రాత్రి బాపట్లకు సమీపంలోని జిల్లెళ్ళమూడిలో 'అమ్మ' సన్నిధిలో జరిగిన సాహిత్య ఆధ్యాత్మిక కార్యక్రమంలో శ్రీ లక్ష్మణ యతీంద్రులవారు పాల్గొని ప్రసంగించారు. రామకృష్ణ సత్కార సభలో శ్రీ విశ్వయోగి విశ్వంజీ తన ఆశీస్సులు అందిస్తూ, రామకృష్ణ రచించిన 'శ్రీ చరణ వైభవం' ఒక పరిశీలన గ్రంథమని ఆయనకు మనం డాక్టరేట్ ప్రదానం చేస్తున్నామని అన్నారు. ఏ మతమైనా, ఏ కులమైనా మనిషికి మించిన దైవం లేదు. ఒక్కరి కోసం అందరూ కలిసి విశ్వశాంతిని తేవాలి అన్నారు. జిల్లెళ్ళమూడిలో ఆదివారం జరిగిన కార్యక్రమానికి 'సభాసామ్రాట్' డాక్టర్ కె. వి. యస్. ఆచార్య వ్యాఖ్యాతగా వ్యవహరించారు. 30 సంవత్సరాలుగా అమ్మకు సేవలందించిన శ్రీ రామకృష్ణ రచించిన 'శ్రీ చరణ వైభవం', 'వాత్సల్యగంగ' కావ్యగ్రంథాల ఆవిష్కరణ జరిగింది. సభలో సన్మాన సంఘ కన్వీనరు డాక్టర్ ఉప్పల వరలక్ష్మి, మాతృశ్రీ విద్యాపరిషత్ అధ్యక్షులు శ్రీ రావినూతల రామచంద్రరావు, డాక్టర్ ప్రసాదరాయకులపతి, మాస్టర్ మోపిదేవి కృష్ణస్వామి, మాస్టర్ ఎ. వి. వి. ప్రసాద రావు తదితరులు ప్రసంగించారు. గాన కోకిల శ్రీమతి పి. నిర్మల పాడిన 'వాత్సల్య గంగ' (అమ్మ పాటల సంపుటి) లోని కొన్ని పాటలను సుమధురంగా పాడి శ్రోతలను ఆనందపరిచారు. రామకృష్ణ, పద్మావతి దంపతులను విశేషరీతిన అభిమానులు సత్కరించారు. - ఆంధ్రజ్యోతి **10-3-1992**

ఆరిపోని దివ్యజ్యోతి కొండముది జీవితం

బాపట్ల, మార్చి 9 (న్యూస్‌ఫ్లాష్) : 'అమ్మ చరణ సన్నిధిలో తన జీవితాన్ని కర్పూరంలా వెలిగించిన వ్యక్తి కొండముది రామకృష్ణ అని ఆయన జీవితం ఆరిపోని దివ్యహారతిలా వెలుగొందుతుందని శ్రీ లక్ష్మణ యతీంద్రులు వారన్నారు. ఆదివారం రాత్రి బాపట్ల సమీపంలోని జిల్లెళ్ళమూడిలో 'అమ్మ' సన్నిధానంలో జరిగిన సాహిత్య ఆధ్యాత్మిక కార్యక్రమంలో శ్రీ లక్ష్మణ యతీంద్రుల వారు పాల్గొన్నారు. అమ్మ లోకాన్ని పావనం చేసిన మాతృమూర్తి అని లక్ష్మణ యతీంద్రుల వారు అన్నారు.

రామకృష్ణ సత్కార సభలో శ్రీ విశ్వయోగి విశ్వంజీ తన ఆశీస్సులు అందిస్తూ రామకృష్ణ రచించిన 'శ్రీ చరణ వైభవం' ఒక పరిశీలన గ్రంథమని ఆయనకు మనం డాక్టరేట్ ప్రదానం చేస్తున్న ఉత్సవం ప్రస్తుతం జరుగుతున్నదని అన్నారు. 'వాడు (రామకృష్ణ) అప్పికట్లకు కరణం నాకు ఉపకరణం' అని జిల్లెళ్ళమూడి అమ్మ అన్నారని శ్రీ విశ్వంజీ చెప్పారు. ' ఒక్కడు ఒక్కడు దేముడు ఏ కుల మయినా ఏ మతమయినా ఒక్కడు దేముడు' అని అంటూ మనమంతా సమైక్యంగా నడవాలని ఆయన పిలుపు నిచ్చారు.

మాస్టర్ మోపిదేవి కృష్ణస్వామి ప్రసంగిస్తూ 'సత్కారం అనే బదులు సత్కార్యం సన్మానం అనే బదులు సన్మార్గం' అంటే బాగుంటుందన్నారు.

ఈ కార్యక్రమానికి సభా సామ్రాట్ డాక్టర్ కె. వి. యస్. ఆచార్య వ్యాఖ్యాతగా వ్యవహరించారు, 30 సంవత్సరాలుగా అమ్మకు సేవలందించిన రామకృష్ణ 'అన్నయ్య' రచించిన 'శ్రీ చరణ వైభవం', 'వాత్సల్య గంగ' కావ్య గ్రంధాలు కూడా ఆవిష్కరించారు. సభలో సన్మాన సంఘ కన్వీనరు డాక్టర్ ఉప్పల వరలక్ష్మి, మాతృశ్రీ విద్యా పరిషత్ అధ్యక్షుడు రావినూతల రామచంద్రరావు, డాక్టర్ ప్రసాదరాయకులపతి, మాస్టర్ ఎ.వి.వి. ప్రసాదరావు, ఏకా రాజేశ్వర రావు తదితరులు ప్రసంగించారు. ఆంధ్రప్రభ మాజీ సంపాదకుడు పొత్తూరి వెంకటేశ్వర రావు, బూదరాజు శేషగిరి రావు తదితరులు కూడా పాల్గొన్నారు. రామకృష్ణ, పద్మావతి దంపతులను అభిమానులు ఘనంగా సత్కరించారు.

– **ఆంధ్రభూమి : 10-3-1992**

1993వ సంవత్సరం అమ్మ జన్మదినోత్సవ సభలో కుర్తాళం సిద్దేశ్వర పీఠాధిపతి శ్రీ శ్రీ శ్రీ శివచిదానంద భారతి స్వామి రామకృష్ణ అన్నయ్యను ''కైంకర్యమణి'' బిరుదుతో కుర్తాళం సిద్ధేశ్వరీ పీఠం తరుపున సత్కరించారు.

1991వ సంవత్సరములో మాష్టర్ మోపిదేవి కృష్ణస్వామి ''మానవధర్మ శిక్షణా సంస్థ'' తరుపున రామకృష్ణ అన్నయ్యను విశిష్ట వ్యక్తి గా సత్కరించారు.

అమెరికన్ బయోగ్రాఫికల్ ఇన్స్టిట్యూట్ వారు అన్నయ్య పేరును '' ఇంటర్నేషనల్ డైరెక్టరీ ఆఫ్ డిష్టింగ్విష్డ్ లీడర్షిప్'' పుస్తకంలో నమోదు చేశారు.

ఇలా ఎన్నో సత్కారాలు ఎన్నెన్నో సన్మానాలు. అమ్మను దర్శించిన తమ్ముళ్ళ హృదయంలో 'అన్నయ్య'గా పీఠం వేసికొని కూర్చున్నాడు మన కధానాయకుడు రామకృష్ణ.

-)O(-

అమ్మా!
నీ కథలే నా పారాయణమూ
నీ చరితే నారామాయణమూ
నీ కృతులే నా ఆరాధనమూ
నీ స్మృతులేగా తరగని ధనమూ - అన్నయ్య

అమ్మా!
నీ గదిలోపల సేవలు చేసిన నాకూ
నీ ఎదలోపలి దివ్వెలు చూసిన నాకూ
నీ గుడిలోనికి దారి చూపక పోతివేమీ. - అన్నయ్య

అమ్మా!
నీ ఉపకరణం నేనై
నీ అవయవమే నేనై
నీకై బతుకును సాగిస్తాను
నేనొక ఋషినై జీవిత లక్ష్యం సాధిస్తాను - అన్నయ్య

అయినప్పటికీ అనే కులం
మనందరిదీ ఒకే కులం - అన్నయ్య

అమ్మ తోనే నా లోకమంతా
అమ్మధ్యాసే నా దైవచింతా - అన్నయ్య

15 లేఖలు

రామకృష్ణ అన్నాయ్య 'అమ్మ'కు సర్వార్పణ చేశాడు. మనసావాచా కర్మా 'అమ్మ'నే ఆరాధించాడు , అర్చించాడు. అమ్మతో కొద్ది ఎడబాటు కూడ అన్నయ్య భరించ లేకపోయేవాడు. ఆకొద్ది సమయంలోనే అన్నయ్య 'అమ్మ'కు ఎన్నో లేఖలు వ్రాస్తుండేవాడు. వాటిలో మచ్చుకి కొన్ని

1. అమ్మా !

కారుమబ్బులురిమినా
కడలి పొరలితరిమినా
పథం విడిచి పారిపోను
నీదు పదం వదిలి జారిపోను - నమస్సులతో

నీ అనుంగు బిడ్డ రామకృష్ణుడు,
20-12-1963

2. అమ్మా....

నమస్కారాలు....
ఒకే స్మృతి, ఒకే శృతి
ఒకే ధ్యాస, ఒకే ఆస....
ఇంటిలోన చదలు పట్టె
కంటిలోన నదులు పుట్టె

నమస్సులతో
నీ అనుంగు బిడ్డ
రామకృష్ణుడు 28-6-1964

3. అమ్మా ....

నన్ను నీవే చూచుకో
నన్ను నీలో దాచుకో

- నీ బిడ్డ
రామకృష్ణుడు 9-12-63

4. అమ్మా అప్పికట్ల
18-5-65
అమ్మా .... సా. 4-25ని

నమస్సులమ్మా ....

'' ఇంద్రభవనంలో ఉండివచ్చాక
పూరిగుడెసె కంటికి నచ్చుతుందా
అమృతం తాగిన తరువాత
కొబ్బరి నీళ్ళు రుచి అనిపిస్తాయా
అలాగే నీ దగ్గర నుంచి వచ్చాక
నేనంటే నాకెంత అసహ్యంగా ఉందో ...''

నమస్సులతో
నీ అనుంగు బిడ్డ
రహి

5. అప్పికట్ల
అమ్మా 6-7-63

నమస్కారములు...

చేసుకున్న వాడికి చేసుకున్నంత మహాదేవ! అన్నారు అనుభవజ్ఞులు. కొరగాని నోములు నోచి కొండ కొముల కెగ బ్రాకాలంటే ఎలా సాధ్యమౌతుంది ?

అమ్మా ! నీ పాదాల చెంత పొరాడాలంటే ఎంత పుణ్యం చేసుకుపుట్టాలి ? నీ చరణ ధూళిలో పొరలాడాలంటే ఎంత అదృష్టవంతుడై ఉండాలి ? నీ సాన్నిధ్యంలో నివాసం సామాన్యులకు దక్కుతుందా ? నీవు విడిచిన గాలి పీల్చడానికయినా అర్హత, యోగ్యత ఉండవద్దూ ??

నమస్సులతో
నీ అనుంగు బిడ్డ
రామకృష్ణుడు

6. అప్పికట్ల
5-7-63

అమ్మా ....

నమస్కారములు....
జీవితం సుఖదుఃఖాల
గంగాయమునల సంగమంలో స్నానం
జీవితం విషాద వినోద

వివిధ రాగ విభిన్న స్వరాల విశిష్ట వీణాగానం... అనిలోగడ పాడుకున్నాను. వాస్తవంలో ఒక్కటే అనుభవమయినా ఊహల మేఘాంచలాలపై ఉయ్యాలలూగుతూ కాని ప్రపంచం చూస్తున్నాను. జీవితం అనుభవిస్తున్నాను. రెండు కనుపించడంలేదమ్మా. అంతా ఒక్కటే రెండోది అనుభవంలోకి రావడం లేదు. మరి నాకేలేదా ? అసలు జగతే ''ఏకం'' తో నిండి ఉన్నదా ?

ఎటు మీటిన
విశ్వవల్లకి విలాప స్వరము లే మెరయు
ఎటు ఊపిన

విశ్వవల్లరి విషాద సుమములే కురియు అని పాడు కోడానికి ఆలాపన చేసుకుంటూంటె మనసు ఎదురు తిరుగుతోంది. ఆశాగీతిక లల్లుకోడానికి మనసు పదాల వెతుక్కుంటోంది. మధువీణ మీటటానికి హృదయం ఆశాతంత్రుల సరి చేసుకొంటోంది ఏంచేయనమ్మా ?

అదిగో లోలోపల ఆశ ఏవో కూనిరాగాలు తీస్తోంది ఇదీ వరస. హాయిగా వింటూ తల ఊపడమా ? ''నీ బొంద! నీ పాటలు హుళక్కి'' అని చెవుల్లో వేళ్ళు దూర్చుకొనడమా?? ఏమిటి కర్తవ్యం

నీ ఆదేశం కోసం ఎదురుచూస్తూ
నీ బిడ్డ
రామకృష్ణుడు

7.

అప్పికట్ల
19-5-65
సా 4.30ని.లు

కంటక వ్రాత సంక్లిష్ట మార్గ సంచారతత్పరా....
అమ్మా ...
నమస్సులమ్మా...
'' మానవుడు మరణించడానికి
చాలా దోవలున్నాయమ్మా...
ఆహారం లేకున్నా
నీరు లేకున్నా
ప్రాణవాయువు లేకున్నా
జీవజ్యోతి ఆరిపోతుంది
ఇవికాక హఠాత్సంభవాలు వేనవేలు కానీ
ఇవేమీ ''నీవు లేక'' కృశించినశించడం కన్నా
బాధాకరాలు కావమ్మా!!''

ప్రణతులతో
నీ
చిరంజీవి రహి

8. అమ్మా
లావొక్కింతయు లేదు
తనువు డస్సింది
మనస్సు విసిగింది
తావుల్ దప్పెను
(మూర్ఛరాలేదు)
శ్రమం బయ్యెడిన్
నీ వెతప్ప నితః పరం బెరుగను
రావేయీశ్వర! కావవెవరద

వేగలేను తప్పించుము బెడద
లెక్కసాగదు, మనస్సు
రెక్కలు విప్పుకుని ఎగురుతుంది
చుట్టూ కత్తుల బోను
ఎటూ వెళ్ళలేను, ఏమి చెయ్యలేను
అవుతుందా జమాబందీ
విడుదలవుతాడా యీ బందీ
ఇది పరీక్షా ? లేక శిక్షా ?

- వ్యర్థుడు
రామకృష్ణుడు
25-5-64
సా. 4.45 ని.లు
తాలుకా ఆఫీసు, బాపట్ల

అన్నయ్య తనతో పాటు తన మిత్రులను అమ్మ సేవకు అంకితం చేశాడు. తన లేఖలతో తన మిత్రులలో 'అమ్మ' పై భక్తిని ప్రేరేపించేవాడు. తన మిత్రుడు నల్లమోతు సత్యనారాయణకి వ్రాసిన లేఖ ఇది.

జిల్లెళ్ళమూడి
20-10-64
అశ్వయుజ పూర్ణిమ

ప్రియ మిత్రుడు సత్యనారాయణకు,

నమస్కారములు...

ఏమిటో, యీ ఉత్తరం రాయడానికి కూర్చుంటే లోగడ అప్పికట్లలోని మన జీవితం కళ్ళ ముందు బొమ్మ కట్టుతున్నది. ఎన్ని సారస్వత గోష్ఠులు, ఎన్ని రాజకీయ సమాలోచనలు ! ఎన్ని కథలూ, ఎన్ని కవితలూ! ఎన్ని చర్చలు !!! అవన్నీ ఏమయి నవి? ? అవన్నీ యిప్పుడు క్రొత్త రూపు దాల్చినయ్. నదులన్నీ సముద్రంలో కలిసినయ్.

ప్రస్తుతం నేను జిల్లెళ్ళమూడిలో మాతృశ్రీ పవిత్ర చరణ సన్నిధిలో జీవితం వెలిగించుకుంటున్నాను. శారీరకంగా రెండువంతులు యిక్కడ, ఒక వంతు అప్పికట్లలోను, అయినా మానసికంగా పూర్తిగా యిక్కడనే. సకల జగత్తుకూ హేతుభూతమూ, సర్వప్రాణి కోటికి శిరోధార్యమూ అయిన ఆ పాద పంకజాలకే సర్వార్పణ!

ఒకసారి నువ్వూ యిక్కడకు రాకూడదూ ? యీ ప్రశాంత వాతావరణంలో ఒక్కసారి శ్వాసించవచ్చు. యీ పవిత్ర తీర్థంలో ఒక్కసారి సుస్నాతుడవు కావచ్చు. ఈ అనురాగరాగలహరిలో నీ హృదయ వీణాతంత్రుల సయితం శ్రుతిచేసుకోవచ్చు. వస్తావు కదూ - నీ కోసం ఎదురు చూస్తూ ఉంటాను.

నీ

రామకృష్ణ

అన్నయ్య తన కొడుకులకు ఉత్తరాలు వ్రాసినా దాంట్లోను జిల్లెళ్లమూడి సంస్థల సేవ గురించే. అన్నయ్య అంకిత భావం అలాంటిది. తన మూడవ కుమారుడు చి॥ ప్రేమ కుమార్‌కు అన్నయ్య వ్రాసిన లేఖే ఇందుకు సాక్ష్యం.

అమ్మ

జిల్లెళ్ళమూడి,
9-8-94.

Dear Prem

అమ్మ ఆశీస్సులతో

చి॥ల॥సౌ॥ సుబ్బలక్ష్మి, నీవు కులసాయే కదా! 'ఆగష్టు 15 ఉత్సవం' ఏర్పాట్లలో హడావుడిగా ఉన్నాను. ఆగష్టు నెలలో బాపట్లలో, తెనాలిలో రైసుమిల్లుల నుండి బియ్యం వసూలు చేద్దామనుకుంటున్నాను. ఆ తర్వాత నెల్లూరు వస్తాను. అప్పుడే అక్కడ వసూలు చేద్దాము. ఆగష్టు 15 ఆహ్వానాలు పంపుతున్నాను. అక్కడ నీవు స్వయంగా వెళ్ళి - రాంప్రసాద్ గారికి, పేరాల వెంకటేశ్వర రావు గారికి, బూర్సు వెంకటేశ్వర్లుకు అందచెయి. డాక్టరు అరుంధతి గారికి, కుమార శాస్త్రికి పంపాము.

అమ్మ సేవలో
భవదీయుడు,
కొం. రామకృష్ణ

అన్నయ్య తన పెద్ద కొడుకు చి॥ సుబ్బారావుకు ఒక లేక వ్రాస్తూ 'అమ్మ' మీద అచంచల విశ్వాసాన్ని ప్రకటిస్తూ తన కొడుకుకు కూడ 'అమ్మ' మీద విశ్వాసం ఉంచమని హితబోధ చేశాడు?

జిల్లెళ్ళమూడి,

24-6-1988.

Dear Subba Rao,

ఆ రోజున అమ్మ దయవల్ల కులాసాగా చేరారను కుంటాను. ఆ రోజున నేనునీతో తిరిగ్గా మాట్లాడ లేక పోయాను. నీతో చెప్పవలసిన విషయం ఒకటి ఉంది.

నేను నీకు ఏమీ యివ్వలేక పోవచ్చు ఎవరికీ ఏమీ యివ్వలేక పోవచ్చు. కాని యిక్కడ కుటుంబం గురించి దిగులు పడవలసిన అవసరం ఏమీ లేదు. అంతా సవ్యంగానే జరిగి పోతుంది. నేను ఎవరి కోసం కుటుంబం కోసం ఆలోచించకుండా అహో రాత్రులు శ్రమించానో ఆ అమ్మే అన్నీ చూసుకుంటుంది. అది అమ్మ వాగ్దానం. ఆ నమ్మికే నాకు బలం. మీరు కూడా ఆనమ్మకంతో నే ఉండండి.

ప్రేమతో మీ నాన్న రామకృష్ణ

జిల్లెళ్ళమూడి సంస్థల పట్ల అన్నయ్య అంకిత భావం అజరామరం, సర్వకాల సర్వావస్థలయందు అదే ధ్యాసం మద్రాసులోని శంకర నేత్రాలయంలో చికిత్స పొందుతూ కూడా జిల్లెళ్ళమూడి సంస్థల మీద ధ్యాసతో అప్పటి రాష్ట్ర విద్యా శాఖాధికారిణి శ్రీమతి వనజాక్షి గారికి ఈ విధంగా లేఖ వ్రాశారు.

శంకర నేత్రాలయం, మద్రాసు

24-9-89

ప్రియతమ సహోదరి

మాన్య- శ్రీమతి వనజాక్షిగారికి....

నమస్కారములు

కంటి చికిత్స కోసం మద్రాసులో ఉన్నందు వల్ల యీ ఉత్తరం వ్రాయటం ఆలస్యమయింది, మన్నించ గోరుతాను

మాతృశ్రీ ఓరియంటల్ కాలేజిని...

1971వ సం॥ లో వాత్సల్యంతో 'అమ్మ' స్థాపించింది. 1989వ సం॥ లో అభిమానంతో మీరు పునరుజ్జీవనాన్ని ప్రసాదించారు. అమ్మ నారు పోసింది మీరు నీరు పోశారు.

ఎల్లప్పుడూ మీ ఆదరాభిమానాలనూ, మీ సహాయ సహకారాలను అర్థిస్తున్నాను.

అభివందనములతో
అమ్మ చరణ సేవలో
మీ సోదరుడు
కొండముది రామకృష్ణ

ఇలా అన్నయ్య ఎవరికి ఉత్తరాలు వ్రాసినా అది బిడ్డలకు కావచ్చు, తమ్ముడికి కావచ్చు, మిత్రులకు కావచ్చు, మేనల్లుళ్ళకు కావచ్చు అది పూర్తిగా 'అమ్మ' గురించి కాని, అమ్మ సంస్థల గురించి కాని అయి ఉంటుంది అనేది నిస్సందేహం. ఇలా అమ్మను సేవించిన అన్నయ్య ధన్యజీవి.

-)O(-

అమ్మ స్మరణలో నన్ను నిరతము ఉండనీ
అమ్మ చరణ కమలాలె మనసంత నిండనీ - అన్నయ్య
ఎక్కితే హిమాలయాలే ఎక్కాలి
మొక్కితే అమ్మ పాదాలకే మొక్కాలి
నవ్వితే పసి పాపలే నవ్వాలి
నమ్మితే అమ్మ పాదాలనే నమ్మాలి - అన్నయ్య
అమ్మా!
నాదేహం నీరథమై - విలసిల్లగవలెనమ్మా!
నా హృదయం నీరదమై
నిన్నభిషేకింపగ వలెనమ్మ! - అన్నయ్య
అమ్మా!
నీ ధ్యాసే నాధ్యానం
నీ ఊసే నాగానం
నీ సేవలే నా ప్రాణం - అన్నయ్య

''మీ మీద మీకు నమ్మకం లేనప్పుడు
దేవుని మీద కూడా నమ్మకం కలగదు''

- స్వామి వివేకానంద

''దేవుడు మనుష్యుల్ని నిలువెత్తు నీళ్ళలో ఎందుకు ముంచుతాడంటే ఊపిరాడకుండా చేసేందుకు కాదు - పరిశుభ్రపర్చేందుకే!'' అంటాడు ఆచెరి. అలాగే బద్దెన సుమతీ శతకంలో....

''తలనుండు విషము ఫణికిని
వెలయంగా తోక నుండు వృశ్చికమునకు
దల దోక యనక నుండును ఖలునకు
నిలువెల్ల విషము గదరా సుమతీ'' !

అంటాడు. ఇవి రెండు దృక్పధాలకు నిలువుటద్దాలు.

అమ్మ అంతేవాసిగా మానవతను, హేతువాదాన్ని పుణికి పుచ్చుకున్న మనీషి - రామకృష్ణ అన్నయ్య. అన్నయ్య మూఢాచారాలకు, మూఢ విశ్వాసాలకు బద్ధ విరోధి. అమ్మవలె సామ్యవాది, విప్లవ భావాలకు సారధి. కులమత వర్ణ వర్గ విచక్షణకు వ్యతిరేకి. గుణదోషాలు ఎంచని మమతానువర్తి, ఆశ్రితపక్షపాతి. ఈ దృష్టి అతనికి ఎన్నో ఇబ్బందులు తెచ్చి పెట్టింది. ఎన్నో విమర్శలకు ఆకరమైంది. గుణదోషాలు ఎంచకుండా అందరినీ ఆదరిస్తాడనే అపప్రధ కూడా వచ్చింది. అయోగ్యులకు కూడా చేయూతనిస్తాడు, అందలాలెక్కిస్తాడనే విమర్శ చెలరేగింది. బంధుమిత్రపక్షపాతి అనీ, కీర్తి కాంక్షాపరుడనీ కొందరు సాడ్డు వేశారు. ''గుణభేదమేలేని నాకు కులభేదమేమిటి'' అన్న అమ్మ మాటలను అక్షరాల ఆచరణలో పెట్టిన సహృదయుడు అన్నయ్య.

'' ఒకరిని దోషిగా ఎంచి మొదటి రాయి రువ్వే ముందు నీలోని దోషాలను ఒక్క సారి గుర్తుకు తెచ్చుకో'' అనే జీసస్ క్రీస్తు మహత్తర సందేశాన్ని మనసారా అనుసరించిన కరుణామయుడు అన్నయ్య.

''రామకృష్ణ అన్నయ్య ఉన్నాడు నాకు ఇక భయము లేదు'' అనే సమాశ్వాసన ప్రతివారిలో కల్గించే వ్యక్తిత్వం అతనిది.

''నేను పడిపోతున్నాను, నన్నుపట్టుకొని నిలబెట్టే ఊతకర్ర ఉన్నాడు, ఆ కర్రే రామకృష్ణ, అన్నయ్య'' అని దైవోపహతులు అనుక్షణం ధైర్యంతో అనుకునే ఆత్మీయుడెవరు ? ఈ అన్నయ్య తప్ప !

అటు మాధవ సేవకు, ఇటు మానవ సేవకు జీవితాన్ని అంకితం చేసిన త్యాగశీలి, దయానిధి, అజాత శత్రువు మన రామకృష్ణ అన్నయ్య. శుభాలలో చేయి అందించటం కాదు అశుభ సమయాల్లోనూ నేనున్నానని ముందుకు వచ్చే అభినవ మోహన్‌దాస్ కరమ్‌చంద్ గాంధీ ఈ అన్నయ్య. అందుకనే ఈ అన్నయ్య అంటే ప్రాణం పెట్టేవారు ఎందరో. శ్రీ మోగులూరు రామచంద్రరావు, సుబ్రహ్మణ్యం, శ్రీ ఆచంట కేశవ రావుగారు మొదలగువారు ఈ కోవకు చెందినవారే.

అభాగ్య జీవులు ఎందరికి కొడుకై తలకొరివి పెట్టాడో ? అనాథ జీవులెందరిని స్మశానానికి శవ వాహకుడిగా మారి మోసుకువెళ్ళాడో ? ఎందరి దుఃఖా శ్రువులను తనవిగా భావించి తుడిచి వేశాడో ? ఎందరి ఉద్యోగాలకు యోగ్యతా పత్రమై నిలిచాడో? ఎందరి వివాహాలకు పెండ్లి పెద్దగా మారి శుభప్రదంగా జరిపాడో ? ఎందరి గృహకల్లోలాలకు శాంతి మంత్రమై శోభిల్లాడో ? ఎందరి ఆస్తి తగాదాలకు అనధికార న్యాయమూర్తియై పరిష్కరించాడో ?

ఎందరికి అమ్మయై, అన్నయై, ఆర్తత్రాణ పరాయణుడై నిల్చి బ్రోచాడో ? కుటిలురు, కృతఘ్నులు, నీచ జనులెందరి పట్ల అవ్యాజ అభిమానం ప్రదర్శించి జరిగినవి మర్చిపోయి వారిని ఆదరించి అక్కున చేర్చుకున్నాడో ? నిలువెల్ల విషము గల ఎన్ని మానవసర్పాలకు తన అనురాగ పరిష్వంగం అందించాడో ?

తను సమస్యల సుడి గుండంలో మునిగి తేలుతూ కూడా నిర్వికారనిశ్చల నిరీహ దృష్టితో, అనిర్వచనీయ ఆనందానుభవంతో చిరు నవ్వులు వెలారుస్తూ సంతోష స్వాంతుడై కన్పిస్తాడో ? నేత్రావరోధంతో ఈ అన్నయ్య బాధపడుతూ వైద్యంనిమిత్తం మద్రాసు ఒంటరిగా వెళ్తున్నప్పుడు మాతృశ్రీ సంస్కృత కళాశాల అధ్యాపకుడు శ్రీమన్నారాయణమూర్తి ''అన్నయ్యా ! ఒంటరిగా వెళ్తున్నావు ఇబ్బంది కాదా ''!

అని అన్నాడు. వెంటనే అన్నయ్య నేను ఒంటరిని ఎందుకు అయ్యాను నావెంట చాల మంది ఉన్నారే !'' అని విశ్వాసం ప్రకటించాడు. ఎవరా ? అని ఆశ్చర్యంగా చూస్తున్న శ్రీమన్నారాయణ మూర్తితో ''రైలులో ప్రయాణం చేస్తూ ఇన్ని వేల మంది ఉండగా నేను ఒంటరిని ఎలా అవుతాను'' అన్నాడు అన్నయ్య. ఈ మాట అన్నయ్య గుండె ధైర్యాన్ని అతని విశ్వాసాన్ని తెలియజేస్తుంది.

అన్నయ్య అనేక సందర్భాలలో అమ్మ ప్రేమను వాత్సల్యాన్ని తను సంపూర్తిగా అనుభవించినట్లు చెప్తూ జీవితంపట్ల తన ప్రగాఢ సంతృప్తిని వ్యక్తపరిచాడు.

ఒక కష్టసాధ్యమైన పనిని సాధించటానికి వెనుకాడిన సందర్భంగాని ''అయ్యో! ఈ పని నావల్ల కాదే'' అని నిరాశపడిన సందర్భంగాని అన్నయ్య జీవితంలో లేదు. చేపట్టిన కార్యక్రమం విజయవంతం చేయ లేక పోవటం అన్నయ్య జీవితంలో చుక్కాని వేసి వెతికినా దొరకదు. అన్నయ్య సంపూర్ణ పురుషుడు అని అందరు అంగీకరించిన సత్యము.

తను సమస్యల సుడి గుండంలో మునిగి తేలుతూ కూడా నిర్వికార నిశ్చల నిరీహ దృష్టితో, అనిర్వచనీయ ఆనందానుభవంతో చిరునవ్వులు వెలారుస్తూ సంతోష స్వాంతుడై కన్పిస్తాడు !

ఆ మహోన్నత హిమవచ్ఛృంగం, ఆ అమ్మ చెక్కిన చందన శిల్పం మన రామకృష్ణ అన్నయ్య.

ఆ అన్నయ్యే ఈ కథానాయకుడు, మా నాయకుడు. ఇది ఒక కల్మష రహితుని కమనీయ చరిత్ర.

-)O(-

నా మనసు అమ్మకే సంవేద్యం
నా తనువు అమ్మకే నైవేద్యం — అన్నయ్య

ప్రేమకు పాదువునీ వమ్మా !
నీ పద పాదుక నేనమ్మా ! — అన్నయ్య

నీ ప్రేమకు మేమే వారసులం
నీకూ ప్రేమకు యిల వారధులం — అన్నయ్య

17 అస్వస్థత

రామకృష్ణ అన్నయ్య స్వతహాగా ఆరోగ్యవంతుడు. చిన్నతనంలో వ్యాయామం చేసేవాడు. మంచి క్రీడాకారుడు. బాల్య, యవ్వనదశలలో వివిధ స్థాయిలలో చెడుగుడు పోటీలలో పలు బహుమతులను అందుకున్నాడు. తర్వాత జిల్లెళ్ళ మూడి ప్రస్థానంలో కూడా అన్నయ్య అవకాశం ఉన్నప్పుడల్లా క్రీడలలో పాల్గొనేవాడు. 'అమ్మ' సేవా కార్యక్రమంలో తలమునకలవుతు కూడా 'నాన్నగారి'తో పలు క్రీడలలో బ్యాట్‌మింటన్, టేబుల్ టెన్నిస్, వాలీబాల్ ఇత్యాది క్రీడలలో పాల్గొనేవాడు. అన్నయ్య మంచి శారీరకదారుఢ్యం కలవాడు అని అందరు అనేవారు. మంచి ఆరోగ్యవంతుడు, స్థిర సంకల్పం కలవాడు కనుకే 'అమ్మ' పూజా వేదిక పై అమ్మతో పాటు గంటలకొద్దీ విగ్రహంలా కూర్చునేవాడు. తన మానవ శరీర లక్షణాలన్నీ అణిచి పెట్టి పూజా కార్యక్రమంలో తన విధుల్ని నిర్వర్తించేవాడు. అమ్మ సేవలో సంపూర్ణంగా అంకితమై అన్న పానాలు కూడ సరిగా తీసికొనే వాడుకాదు. తత్ఫలితంగా అన్నయ్య ఆరోగ్యము క్రమేణ క్షీణించి చిన్న వయసులోనే మధుమేహ వ్యాధిగ్రస్తుడైనాడు. అన్నయ్య కారణ జన్ముడు కనుక, తను సాధించవలసినవి ఎన్నో ఉన్నాయి అన్న అవగాహన ఉన్నవాడు కనుక వ్యాధిని ఎదుర్కోవాలని దృఢనిశ్చయుడై కఠినపత్యము చేసెడివాడు. అమ్మ మీద కల, అచంచల విశ్వాసము, అమ్మ సేవలో అన్నయ్యకు కల అకుంఠిత దీక్ష అన్నయ్యను అనారోగ్యాన్ని జయించగల అవకాశాన్నిచ్చింది. 1985వ సం॥లో అమ్మ అనంత శక్తిలో విలీనమైన తరువాత అన్నయ్య ఒక విధమైన నైరాశ్యంలో కొట్టుమిట్టాడాడు. అప్పటిదాక అణిగిమణిగి ఉన్న అనారోగ్యము జడలు విప్పుకొని వికటాట్టహాసము చేసింది. మధు మేహ వ్యాధి విజృంభించింది. శరీరము పై గడ్డలను ప్రేరేపింప చేసింది. అన్నయ్య శరీరం కృశించి పోయింది. నేత్రావరోధము కల్గింది. అదే సమయంలో అమ్మ సంస్థల నిర్వహణ భారము అధికమైంది. బాధ్యతా నిర్వహణలో శరీరాన్ని మరోసారి అలక్ష్యం చేశాడు. కాలహరణం కాలసర్పమై అన్నయ్యను కాటు వేసింది. ఒక కన్ను కోల్పోయాడు అన్నయ్య. అయినా అన్నయ్య అమ్మ కరుణను, ధైర్యాన్ని కోల్పోలేదు. కనీసము రెండో

కన్నునైనా అన్నయ్య కోల్పోకూడదని సోదరబృందం అన్నయ్యను వైద్యనిమిత్తం 1986వ సం॥లో మద్రాసు పంపించింది. మద్రాసులో ఇంజనీర్ తాతయ్య శ్రీ చుండూరి సీతారామయ్యగారి కుమారుడు శ్రీ అచ్యుత్ చుండూరి వారి ఇంట్లో ఉండి అన్నయ్య చికిత్స పొందాడు. శంకర నేత్రాలయంలో డాక్టర్ లింగం గోపాల్ గారి ఆధ్వర్యంలో కంటి ఆపరేషన్ దిగ్విజయంగా జరిగింది. ఇక్కడ ఒక విషయం చెప్పుకోవాలి. మామూలుగా రెటీనా డిటాచ్‌మెంటు జరిగితే ఇక ఏ ఆపరేషన్ కంటి చూపును ప్రసాదించలేదు. కాని దురదృష్టవశాత్తు ఆపరేషన్ టేబుల్ మీద అన్నయ్యకు రెటీనాడిటాచ్‌మెంటు అయినట్లు డాక్టర్స్ గుర్తించారు. అయినా దైవం మీద భారం వేసి వైద్యులు శస్త్ర చికిత్స పూర్తిచేశారు. వైద్యప్రపంచం విస్తుపోయేటట్లు అమ్మ దయ వలన అన్నయ్యకు కంటి చూపు వచ్చింది. అమ్మకు, అమ్మ సంస్థలకు రెండు కళ్ళు నైవేద్యం పెట్టిన ఈ అందరన్నయ్యకు అమ్మ ఒక కంటిని ప్రసాదంగా తిరిగి ఇచ్చింది. దీన్ని అన్నయ్య ఇలా వివరించాడు. అన్నయ్య ఒక సందర్భంలో అమ్మను ''ఒక కన్ను, ఒక పెన్ను'' ఇమ్మని ప్రార్థించాడట. అమ్మ అన్నయ్యను అనుగ్రహించి ఒకకన్ను ఇచ్చింది. అన్నయ్య తన ఈ చికిత్సయాత్ర దిగ్విజయంగా పూర్తి చేసికొని జిల్లెళ్ళ మూడి తిరిగి వచ్చాడు. ఈ మద్రాసు మజిలీలో అన్నయ్యను కంటికి రెప్పలా, మరో కన్న తల్లిలా చూసుకొన్నది శ్రీమతి జ్యోతి అచ్యుత్.

ప్రయాణాల నిషేధంతోపాటు తీవ్రంగా ఆలోచించటాన్ని నిషేధిస్తూ ఎన్నో సలహాలు, సూచనలతో అన్నయ్యను జిల్లెళ్ళమూడి పంపించారు వైద్యసోదరులు. అన్నయ్య చైతన్యవంత జీవితము ఇంతటితో ముగిసిందని సోదర బృందం ఆవేదనతో కృంగిపోయింది. అయితే జిల్లెళ్ళమూడిలో పరిస్థితులు అన్నయ్యను మరోలా ఆలోచింపచేశాయి. అన్నయ్య సేవాకార్యక్రమాల శంఖారావం ద్విగుణీకృతమైనది. వైద్య లోకము తెల్లబోయేటట్లు, వారు ఇచ్చిన సలహాలను, సూచనలను అటకెక్కించి అన్నయ్య ఒక సుడిగాలిలా ఒక ప్రభంజనంలా రాష్ట్రం అంతా తిరిగి విరాళాలు సేకరించి 'అమ్మ' యాగాన్ని నిర్విఘ్నంగా నిర్వహించాడు. ఇలా అన్నయ్య ఒక పుష్కరం పాటు అమ్మ సేవా కార్యక్రమంలో శిఖరాగ్రాలు అధిరోహించాడు.

మరల 1997వ సంవత్సరములో మధుమేహవ్యాధి అన్నయ్య మూత్రపిండాలను దెబ్బతీసింది. గుంటూరులో డాక్టర్ మల్లికార్జున రావు దగ్గర, హైద్రాబాద్‌లో సత్యకిడ్నీ సెంటర్‌లో డాక్టర్ రామ్‌భూపాల్ దగ్గర చికిత్సపొందాడు అన్నయ్య. అపనమ్మకంగానే వైద్యంచేశారు వైద్యులు. అమ్మ కరుణతో బయటపడ్డాడు అన్నయ్య. ఇకనైనా అన్నయ్య విశ్రాంతి తీసికొవాలి అని అభిప్రాయపడ్డారు ఆత్మీయులు. కాని అన్నయ్య తనే వ్రాసుకున్నట్లు ''నీ సేవలోనే నా బ్రతుకుసాగనీ'' అని అమ్మ సేవలోనే తన అంతిమ జీవితం కూడ గడిపాడు. ఉత్తర ప్రత్యుత్తరాల ద్వారానే విరాళాలు సేకరించి అమ్మ సంస్థను నిర్వహించాడు. ఈ కాలంలో అన్నయ్య వైద్యనిమిత్తం హైద్రాబాద్ వెళ్ళినప్పు డల్లా వరంగల్ శేషయ్యలింగం గారి అమ్మాయి, శ్రీ బి. వెంకటేశ్వర గుప్తాగారి భార్య శ్రీమతి రాణి అన్నయ్యకు విశేషంగా సేవలు చేసింది. అనంతమైన వాత్సల్యాన్ని అన్నయ్య పై కురిపించింది. అమ్మతత్వాన్ని అమ్మ జీవితవిశేషాలను తెలియ జేయటానికి అన్నయ్య వ్రాసిన ''మాతృసంహిత'' గ్రంథ ప్రచురణకు భూరి విరాళం ఇస్తూ ఎంతగానో ప్రోత్సహించింది.

ఈ అనారోగ్య కాలంలో జిల్లెళ్ళమూడిలో శ్రీమతి బహ్మాండం వసుంధర అక్కయ్య అన్నయ్యను కంటికి రెప్పలా చూసుకున్నారు. చి॥ కొత్త ప్రసాద్ అన్నయ్యకు చేదోడు వాదోడుగా ఉన్నాడు. 1998వ సంవత్సరములో అన్నయ్య మళ్ళీ తీవ్ర అనారోగ్యమునకు గురిఅయినాడు. ఈ సారి మధుమేహం గుండెజబ్బుకు దారి తీసింది. హైద్రాబాద్‌లో డాక్టర్ ఉమేష్‌చంద్ర దగ్గర చికిత్స పొందాడు. మృత్యుముఖం నుండి బయట పడ్డాడు అన్నయ్య. అన్నయ్య తను 'అమ్మ' మీద వ్రాసిన గ్రంథం ''మాతృ సంహిత'' ప్రచురణ చెయ్యాలన్న ప్రగాఢ వాంఛతోనే ప్రాణాల్ని నిలబెట్టుకున్నాడని వైద్యులు కూడ అంగీకరించారు. హాస్పిటల్ బెడ్‌మీదే అన్నయ్య ఈ గ్రంథ ప్రచురణకు శ్రీకారం చుట్టాడు. జిల్లెళ్ళమూడి వెళ్ళిన వెంటనే సోదరి పోతుకూచి ఝాన్సీ లక్ష్మీబాయి సహకారంతో ''మాతృసంహిత'' ప్రెస్ కాపీ సిద్ధంచేశాడు. మే 1998లో అన్నయ్యను పరామర్శించటానికి వచ్చిన భారత ఎలక్షన్ కమీషనర్ శ్రీ జి.వి.జి. కృష్ణమూర్తి ఈ గ్రంథాన్ని ఆవిష్కరించారు. తన ఈ అంతిమ కోర్కెను తీర్చుకున్న

రామకృష్ణ అన్నయ్య తన వ్యాధులకు చికిత్సపొందుతూనే జిల్లెళ్ళమూడిలోనే తన ప్రాణాలు వదలాలి అనే తన జీవితాశయం నెరవేర్చుకున్నాడు. అన్నయ్య అనారోగ్యానికి పాల్పడ్డ దగ్గర నుంచి అన్నయ్యకు సోదర వాత్సల్యంతో చికిత్స చేశారు డ్సాక్టర్ విద్యాసాగర్, బాపట్ల, డా॥ కోన సత్యనారాయణ మూర్తి గార్లు. 1998వ సం॥ ఆగష్టు నెలలో చికిత్స నిమిత్తమై బాపట్ల వచ్చాడు అన్నయ్య. కాని తన జీవితం ముగింపుకు వచ్చింది అని తెలిసికున్న అన్నయ్య దాచేపల్లిలో పని చేస్తున్న తన పెద్ద కుమారుడు సుబ్బారావును బాపట్ల పిలిపించి, ''సుబ్బారావు నేను ఈ శారీరక బాధలు పడలేక పోతున్నాను. జీవితం మీద ఇచ్ఛ నశించింది. నేను పోతున్నాను. నన్ను నీవు వెంటనే జిల్లెళ్ళమూడి తీసి కొనిపో!'' అని ఆదేశించాడు. ఆగష్టు 23వ తారీఖు మధ్యాహ్నం ఒంటిగంటకు అన్నయ్య జిల్లెళ్ళమూడి చేరాడు. ఆనాటి రాత్రి అన్నయ్య ఆరోగ్యం ఇంకాక్షీణించింది. అన్నయ్య రెండవ కుమారుడు చి॥ సుధాకర్, కూతురు సీతామహలక్ష్మి, మేనల్లుడు శ్యామ్ ప్రసాద్‌ముఖర్జీ అన్నయ్యను వైద్యనిమిత్తం హైద్రాబాద్ తరలిద్దామని ప్రయత్నాలు చేస్తుండగానే అన్నయ్య ప్రాణాలు అమ్మలో ఐక్యమయినాయి. ఇలా మధుమేహ వ్యాధి అన్నయ్య అనారోగ్యానికి, చివరగా అన్నయ్య అంతిమ యాత్రకు దోహదం చేసింది.

-) ○ (-

అమ్మా !

మనసారా పాడెద నీనామమే !

కనులారా చూసెద నీ రూపమే !

మారని మనసులు మారి

మానవాళి సుఖ మందే దారి

శోధించాలని, సాధించాలని నా ప్రయత్నం - అన్నయ్య

అమ్మంటే నా కెంతో మక్కువ

బ్రహ్మ కూడ అమ్మ కంటె తక్కువ - అన్నయ్య

''చెలివై, చుట్టమువై, మనస్థితుడవై
చిన్మూర్తివై, ఆత్మవై, వల్లివై, కోర్కెలపతివై
విభుడవై ......''........... ప్రార్థన

అందరినీ అలరించి, అందరికీ సమాశ్వాసన కలిగించి మట్టి మనుషులను మహారణానికి సన్నద్ధులను చేసిన వీరయోధుడు రామకృష్ణ అన్నయ్య విధివశాన రోగగ్రస్తుడై రెండేళ్ళపాటు అనునిత్యం మృత్యువుతో పోరాడి అలసి సొలసి 23-8-1998న శ్రీబహుధాన్య నామ సంవత్సర భాద్రపదశుక్ల విదియ ఆదివారము నాడు రాత్రి 11-30నిలకు అస్తమించాడు. తన తుది కోర్కె తీర్చుకొన్నాడు. పుణ్య భూమి అర్కపురి గడ్డ మీదనే అంతిమ శ్వాస వదిలాడు. అస్తమించిన నాటి ఉదయం 9గంటల నుంచి 10 గంటల వరకు అన్నయ్య ప్రక్కన కూర్చుని దూరదర్శన్‌లో ''శ్రీకృష్ణ'' పౌరాణిక సీరియల్‌చూసే భాగ్యం నాకు కలిగించాడు. అది ఒకటే ఊరట. 1998 ఆగష్టు 15 స్వాతంత్ర స్వర్ణోత్సవం, అన్నపూర్ణలయ వార్షికోత్సవం నాడు నా చేత పతాకావిష్కరణ చేయించి ఉపన్యసింప చేశాడు. అంతకు ముందు అన్నయ్య సన్మానం వైభవంగా జరిగినప్పుడు వేదిక నెక్కి లఘు ప్రసంగం చేశాను.

జిల్లెళ్లమూడిలో దహన సంస్కారాలు జరిగినపుడు చితి సజ్జల శోకం పొంగిపరవళ్ళు త్రొక్కింది. అన్నయ్య అత్యంత అభిమానించే మహా కవి శ్రీశ్రీ పలుకుల్లోని

''చీకటి ముసిరిన ఏకాంతములో
నిన్ను నిన్నుగా ప్రేమించుటకు
నీ కోసమే కన్నీరు నించుటకు
తోడొకరుండిన అదే భాగ్యము !
అదే సౌఖ్యమూ !!

అన్న భావనను ఆరోజు ప్రత్యక్షంగా చూశాము. అన్నయ్య అంతిమ యాత్ర కన్నీటిధారల మధ్య సాగిపోయింది. అభిమానుల దుఃఖాశ్రువుల తెప్ప మీద తేలిపోతూ ఆవలి తీరాలకు చేరుకున్నాడు. పరిపూర్ణ ప్రశాంతిని చేరుకొన్నాడు.

ఇలా ఒక ధన్య జీవితం పరిసమాప్తమైంది. జల్లెళ్ళమూడి చరిత్రలో ఒక సువర్ణాధ్యాయం ముగిసి పోయింది.

అంతర్యామీ ! అలసితి సొలసితి ఇంతటి నీ శరణిదే చొచ్చితినీ, కోరిన కోర్కెలు కోయనికట్లుతీరవు నీ వరితెంచక, భారపు పగ్గాలు, పాపపుణ్యములు నేరూపున బోవు నీవు వద్దనక !

''పుట్టుటయు నిజము
పోవుటయు నిజము
నట్టనడిమి పని నాటకమూ
ఎట్ట నెదుటగలది ప్రపంచం
కట్టకడపటిది కైవల్యమూ ''

- అన్నమాచార్య

-) ೦ (-

19 అశ్రుతర్పణ

'రామకృష్ణ అన్నయ్య' మనకిక లేడు అన్న వార్త అమ్మ బిడ్డలందరిని దిగ్భ్రాంతులను చేసింది. అందరు దుఃఖ సముద్రంలో మునిగి పోయారు. ఇన్నాళ్ళు తమను ఆదుకున్న ఆపద్బాంధవుడు రామకృష్ణ అన్నయ్య అమ్మలో ఐక్యమయినాడన్న వాస్తవము జీర్ణించు కోలేక జిల్లెళ్ళమూడి వాస్తవ్యులు పడ్డ ఆవేదన వర్ణనాతీతం. అమ్మకు బిడ్డలకు వారధిగా నిలిచిన ఈ పరమాత్మ సారథి కనుమరుగైనాడన్న సత్యం తట్టుకో లేక అమ్మ బిడ్డలందరు విలవిలలాడారు. ఇన్నాళ్ళు, ఇన్నేళ్ళు తమను కంటికి రెప్పలా చూసుకొన్న 'అన్నయ్య' అంతర్ధానం తమ్ముళ్ళ, చెల్లెళ్ళ గుండెల్లో చిచ్చుపెట్టింది. అందరు అశ్రునీరాజనం అర్పించారు.

ప్రముఖ దినపత్రికలు అన్నయ్య అంతిమ యాత్ర, సోదరుల అశ్రుతర్పణ వివరిస్తూ ఇలా వ్రాసాయి.

మాతృశ్రీ సంపాదకుడు రామకృష్ణ మృతి

ఈనాడు : బాపట్ల, ఆగష్టు 24 (న్యూస్‌టుడే) : శ్రీ విశ్వజననీ పరిషత్ అధ్యక్షుడు కొండముది రామకృష్ణ అన్నయ్య (65) బాపట్ల మండలం జిల్లెళ్ళమూడిలో ఆదివారం అర్ధరాత్రి మృతిచెందారు. గత సంవత్సరకాలంగా గుండె జబ్బు కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న రామకృష్ణ అన్నయ్య మాతృశ్రీ విద్యాపరిషత్ కార్యదర్శిగా అధ్యక్షునిగా మాతృశ్రీ పత్రిక సంపాదకునిగా ఎన్నో కీలక మైన పదవులను నిర్వహించారు. సోమవారం సాయంత్రం అంత్యక్రియలు జరిగాయి. జిల్లెళ్ళమూడి అమ్మ సంస్థ సర్వతోముఖాభివృద్ధికి తన జీవితాన్ని అంకితం చేసిన మహనీయుడు రామకృష్ణ అన్నయ్య అని జిల్లెళ్ళమూడి అమ్మ సంస్థల బృందం, భక్తులు, మాతృశ్రీ విద్యాపరిషత్ నిర్వాహకులు, విద్యార్థులు అశ్రునీరాజనం అర్పించారు.

జిల్లెళ్ళమూడి 'అమ్మ' ఆంతరంగిక కార్యదర్శి రామకృష్ణ మృతి

వార్త : బాపట్ల, ఆగష్టు 25 (ప్రభాతవార్త) : బాపట్ల మండలం జిల్లెళ్ళమూడి 'అమ్మ' ఆంతరంగిక కార్యదర్శి, మాతృశ్రీ మాసపత్రిక సంపాదకులు కొండముది రామకృష్ణ

(65) జిల్లెళ్ళమూడి 'అమ్మ' ఆశ్రమంలో ఆదివారం రాత్రి మృతి చెందారు. అమ్మ స్థాపించిన మాతృశ్రీ విద్యాపరిషత్, విశ్వజననీ పరిషత్ సంస్థల అధ్యక్షునిగా, కార్యదర్శిగా వ్యవహరించిన కొండముది రామకృష్ణ కొంతకాలంగా అస్వస్థతగా ఉన్నారు. జిల్లెళ్ళమూడి అమ్మ జీవిత చరిత్రని మూడు సంపుటాలుగా రచించేందుకు 1971లో ఈయన శ్రీకారం చుట్టి పూర్తిచేశారు.

అమ్మ ఆంతరంగిక కార్యదర్శిగా ఆమె ఆశయాలకి అనుగుణంగా 1973లో అమ్మ స్వర్ణోత్సవ జన్మదినోత్సవం సందర్భంగా జిల్లెళ్ళమూడిలో లక్షమందికి ఒకే పంక్తిలో అన్నసంతర్పణ నిర్వహించడంలో రామకృష్ణ ప్రధానపాత్ర వహించారు. కొండముదికి భార్య, నలుగురు కుమారులు, కుమార్తె ఉన్నారు.

ఆయన మృతిపట్ల బాపట్ల ప్రాంతంలోని పలువురు ప్రముఖులు, రాష్ట్ర, జిల్లావ్యాప్తంగా ఉన్న అమ్మభక్తులు ప్రగాఢ సంతాపాన్ని వెలిబుచ్చారు. కాగా కొండముది రామకృష్ణ భౌతిక కాయానికి సోమవారం జిల్లెళ్ళమూడిలో అంతిమ సంస్కారాలు నిర్వహించారు. అమ్మ భక్తులు ఆప్యాయంగా 'అన్నయ్య' అని పిలుచుకునే రామకృష్ణకు పలువురు శ్రద్ధాంజలి ఘటించారు. వీరిలో విశ్వంజీ, మాతృశ్రీ విద్యాపరిషత్ చైర్మన్ తురుమెళ్ళ చెన్నకేశవమూర్తి, కొండముది హనుమంతరావు, మాతృశ్రీ ఓరియంటల్ ప్రిన్సిపాల్ పన్నాల రాధాకృష్ణ శర్మ, బ్రహ్మాండం రవీంద్ర, విశాఖ సోదరులు త్రిలోక వెంకట అప్పారావు, రామబ్రహ్మం, శ్రీమన్నారాయణ మూర్తి, కోన సత్య నారాయణ మూర్తి, లక్ష్మీనారాయణ, విశ్వజననీ హిందూ పరిషత్, మాతృశ్రీ విద్యాలయం, ఓరియంటల్ కళాశాలల సభ్యులు, అధ్యాపకులు, విద్యార్థినీ విద్యార్థులు ఉన్నారు.

అప్పికట్ల గ్రామ కరణం 'అమ్మ'కు ఉపకరణం

ఆంధ్రభూమి : బాపట్ల, ఆగస్టు 28 : 'వాడు అప్పికట్ల గ్రామ కరణం - నాకు ఉపకరణం' అన్నారు రామకృష్ణ 'అన్నయ్య' గురించి చెబుతూ జిల్లెళ్ళమూడి 'అమ్మ'. బాపట్ల సమీప గ్రామం జిల్లెళ్ళమూడి 'అమ్మ' పాదస్పర్శచే ఒక ఆధ్యాత్మిక కేంద్రంగా వెలిసింది. జిల్లెళ్ళమూడి 'అమ్మ'కు అంతరంగిక కార్యదర్శిగా మానసపుత్రునిగా పరిగణింపబడ్డారు, అప్పికట్ల కరణంగా ఉంటూ 1962 నవంబరు 11న 'అమ్మ' పాద సన్నిధిని చేరారు రామకృష్ణ. మాతృశ్రీ విద్యాపరిషత్, విశ్వజననీ

పరిషత్‌లకు అధ్యక్షులుగా కార్యదర్శిగా చాలా కాలంగా ఉంటూ తన దక్షతను నిరూపించుకున్నారు. 'అమ్మ'కు అంతరంగిక కార్యదర్శిగా వారి జీవితాన్ని గురించి సిద్ధాంతాల గురించి లోకానికి ఎరుకపరిచారు.

జీవిత మహోదధిలో తరంగాలు, మాతృదర్శనం, శ్రీచరణ వైభవం, వాత్సల్యగంగ, అన్నపూర్ణాలయం, అమ్మ అద్వైమూర్తి, హైమాలయం వంటి రచనలు గావించారు. దివంగత రామకృష్ణ 'అన్నయ్య' రాసిన గ్రంధాలపై పలువురు విమర్శకులు పరిశోధనా వ్యాసాలను సమర్పిస్తున్నారు. ఆయన రచనలయిన శ్రీచరణ వైభవం, వాత్సల్య గంగల పై మాతృ శ్రీవిద్యా సంస్థల పూర్వ విద్యార్థి యస్.యల్. వి. ఉమామహేశ్వర రావు డాక్టర్ యమ్ వీరభద్రయ్య పర్యవేక్షణలో థీసీస్‌ను రూపొం దించడం ఇందుకు ఉదాహరణ. ఉత్తమ రచయితగా పేరుగాంచిన కొండముది రామకృష్ణ 'మాతృశ్రీ' పత్రికకు 20 సంవత్సరాలపాటు సంపాదకుడుగా పని చేశారు. ఆయన పలు రేడియో నాటికలు రాశారు. వారు రచించిన గేయాలు పత్రికల్లో ప్రచురితమ య్యాయి. జిల్లెళ్ళమూడి 'అమ్మ' పై చలన చిత్రంను రూపొందించగా ఆ చిత్రానికి వ్యాఖ్యాన రచయితగా పేరు తెచ్చుకున్నారు.

ప్రముఖ పాత్రికేయులు పొత్తూరి వెంకటేశ్వర రావు రామకృష్ణ 'అన్నయ్య'ను 'అమ్మ మంచానికి అయిదవ కోడు'గా వర్ణించారు. 'అమ్మ రామకృష్ణ పరమహంస అయితే, 'అన్నయ్య' వివేకానందుడు, 'అమ్మ' శ్రీరామచంద్రుడయితే అన్నయ్య హనుమంతుడు అని ఆంధ్రాయూనివర్శిటీ ప్రొఫెసరు యల్. యస్. ఆర్. కృష్ణశాస్త్రి ఒక సందర్భంలో అన్నారు. శ్రీ లక్ష్మణ యతీంద్రులవారు తమ ప్రసంగంలో రామకృష్ణ గురించి ఒకసారి చెబుతూ అమ్మ మహాసాగరం, ఆ సాగరం నుండి ఉత్తుంగ తరంగంగా విరిసిన తెలినురుగు ఈ రామకృష్ణ అన్నారు. విశ్వయోగి విశ్వంజీ మహారాజ్ 'అమ్మ అన్నయ్య వేరు కాదు అన్నయ్యే అమ్మ' అనడం విశేషం.

గుంటూరు హిందూ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ప్రసాదరాయ కులపతి 'జిల్లెళ్ళ మూడి అమ్మ సిద్ధాంతం గురించి చెబితే రామకృష్ణ అన్నయ్యే చెప్పాలి' అన్నారు 'రామకృష్ణ అన్నయ్యను అమ్మ తన సింహాసనంగా స్వీకరించింది. తన సందేశాన్ని ఆ సింహాసనం నుండి వినిపిస్తున్నది' అన్నారు మాస్టర్ మోపిదేవి కృష్ణస్వామి. కుర్తాళ

పీఠాధిపతి వారు రామకృష్ణకు 'కైంకర్యమణి' అనే బిరుదును ప్రదానం చేశారు. ప్రముఖ పాత్రికేయులు కొండముది దత్తాత్రేయ రామకృష్ణ జీవిత చరిత్రను 'అమ్మ చెక్కిన చందన శిల్పం' పేర రచించారు.

1934 జూన్ 26న అప్పికట్ల గ్రామంలో కొండముది వెంకటసుబ్బారావు, అన్నపూర్ణమ్మ దంపతులకు జన్మించిన రామకృష్ణ తన 65వ ఏట (1998 ఆగస్టు 23న) కన్ను మూశారు 'అమ్మ' సన్నిధిలో శ్రీ విశ్వంజీ మహరాజ్‌సమక్షంలో సెప్టెంబరు 3 (గురువారం) రామకృష్ణ సంస్మరణ నిమిత్తం 'అనుగ్రహ సదస్సు' నిర్వహించనున్నారు. చీఫ్ ఎలక్షన్ కమీషనరు జి. వి. జి. కృష్ణమూర్తి, విశాఖ మాతృశ్రీ అధ్యయన పరిషత్ అధ్యక్షుడు మాస్టర్ ఎ. వి. వి. ప్రసాదరావు, ప్రముఖ రచయిత, పాత్రికేయుడు కొండముది శ్రీరామ చంద్రమూర్తి తదితరులు 'అనుగ్రహ సదస్సు'లో పాల్గొననున్నారు.

'అమ్మ' ఆశయానికి ఆకృతి 'కొండముది'

వార్త : (ప్రభాతవార్త - బాపట్ల) : ప్రసిద్ధ ఆధ్యాత్మిక కేంద్రమైన జిల్లెళ్ళమూడిలోని అమ్మ ఆశయానికి ఆకృతిగా నిలిచిన కొండముది రామకృష్ణ అమ్మ సంస్థల సర్వతోముఖ వికాసానికి ఎన లేని కృషి చేశారు. జిల్లెళ్ళమూడి అమ్మ అంతరంగిక కార్యదర్శిగా విశిష్ట సేవలను అందించిన కొండముది రామకృష్ణ ఆగస్టు 23వ తేదీ అర్ధరాత్రి కన్నుమూసిన సంఘటన పాఠకులకు విదితమే.

బాపట్ల మండలం అప్పికట్లలో జన్మించిన ఆయన తన 28వ యేట జిల్లెళ్ళమూడిని ప్రధాన నివాసంగా చేసుకున్నారు. అమ్మకు, భక్త జనులకు మధ్య వారధిగా కొండముది వ్యవహరించి అందించిన సేవలు చిరస్మరణీయం. రెండు దశాబ్దాలపాటు మాతృశ్రీ మాసపత్రికకు సంపాదకులుగా పని చేసిన ఆయన అమ్మ ఆశయాలను, సిద్ధాంతాలను బహుళ ప్రచారం చేశారు. అమ్మ సన్నిధిలో తాము పొందిన దివ్యానుభూతిని సంపాదకీయ వ్యాసాలుగా మాతృశ్రీ పత్రికలో వెలువరించారు. అమ్మ - అద్వైత మూర్తి, మాతృదర్శనం, అన్నపూర్ణాలయం, హైమాలయం, అనసూయా కల్యాణం వంటి మొదలైన రచనలు అమ్మను, అమ్మతత్వాన్ని అన్ని కోణాల నుంచి కొండముది జాతికి పరిచయం చేశారు. 1974లో అమ్మ చలనచిత్రం

రూపొందించినప్పుడు చిత్రానికి ప్రత్యక్ష వ్యాఖ్యానం వ్రాసి ఆయన ఆంధ్ర ప్రేక్షకలోకానికి అమ్మ ఆధ్యాత్మిక సిద్ధాంత వైభవాన్ని చేరువ చేశారు. 1985లో అమ్మ ఆలయ ప్రవేశం చేసి విగ్రహ రూపిణిగా దర్శనమిస్తూ భౌతికంగా కనుమరుగైన క్లిష్టదశలో సోదర బృందాన్ని ఉత్తేజితం చేసే అన్నయ్యగా కొండముది రామకృష్ణ అమ్మ ఆశయాలకు అనుగుణంగా సంస్థ పురోగమించే ప్రేరణని కల్పించారు.

1971లో మాతృశ్రీ విద్యాపరిషత్ ఆధ్వర్యంలో మాతృశ్రీ సంస్కృత కళాశాల, దీనికి అనుగుణంగా సంస్కృత పాఠశాల ఏర్పర్చి ఆయన విద్యా సంస్థల అభ్యుదయం కోసం పాటు పడ్డారు. మాతృశ్రీ విద్యాపరిషత్ అధ్యక్షులుగా, కార్యదర్శిగా, కళాశాలల, పాఠశాలల కరస్పాండెంటుగా కొండముది సంస్థ పురోభివృద్ధికి ఎంతో దోహదపడ్డారు. అమ్మ ఆశయానికి మానవాకృతిగా నిల్చిన ఈయనను శ్రీశివచిదానంద భారతీ స్వామి 'కైంకర్యమణి' బిరుదుతో సత్కరించారు. కాగా అమ్మ మాటలను, చేతలను అమ్మ జీవిత సన్నివేశాలను అనుభూతి ప్రదంగా ఆవిష్కరిస్తూ వ్రాసిన వ్యాససంపుటి మాతృసంహిత ప్రచురణకావాల్సి ఉంది.

అమ్మ వేసిన ఆశయబాటలో జీవించి అమ్మలోనే ఐక్యమై పరమపదించిన అందరి అన్నయ్య కొండముది సంస్మరణ సభని సెప్టెంబర్ మూడున బాపట్ల మండలం జిల్లెళ్ళమూడిలో నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో అమ్మ ఆశయ సాధనలో కొండముది నడచిన బాటలో భక్తులను ముందుకు తీసుకొని వెళ్లాల్సిన బాధ్యత విశ్వజననీ పరిషత్, మాతృశ్రీ విద్యాపరిషత్‌ల పైన ఎంతైనా ఉంది.

రామకృష్ణ అన్నయ్య సేవలు శ్లాఘనీయం

ఈనాడు : బాపట్ల, సెప్టెంబరు 3 (న్యూస్‌టుడే) : 'నీకున్నది సంతృప్తిగా తిని మిగిలింది ఇతరులకు ఆదరంగా పెట్టుకో' అనే జిల్లెళ్ళమూడి అమ్మ సూక్తిని వేదంగా ప్రచారం చేసి అమ్మ ఆశయాలకు అనుగుణంగా జిల్లెళ్ళమూడిలో సంస్థల నిర్వహణకు తుదివరకు అంకితభావంతో పని చేసిన కొండముది రామకృష్ణ అన్నయ్య సంస్మరణ సభలో విశాఖ మాతృశ్రీ పరిషత్ అధ్యక్షులు ఏ.వి.వి. ప్రసాదరావు, తెనాలి విశ్వజననీ పరిషత్ నిర్వాహకులు ప్రసంగిస్తూ నివాళులర్పించారు. పలు మాతృశ్రీ సంస్థల భక్తులు ఈ సభలో ప్రసంగించారు.

జిల్లెళ్ళమూడి అమ్మ ఆశయాలను నెరవేర్చిన కొండముది

వార్త : బాపట్ల, సెప్టెంబర్ 3 (ప్రభాతవార్త) : జిల్లెళ్ళమూడి అమ్మ ఆశయాలను సద్భావంతో నెరవేర్చిన కొండముది భక్తుల మనస్సులలో చిరస్మరణీయంగా నిలిచిపోతారని ప్రముఖ రచయిత కొండముది శ్రీ రామచంద్రమూర్తి అన్నారు. బాపట్ల మండలం జిల్లెళ్లమూడి గ్రామంలోని టిటిడి కళ్యాణ మండపం ఆవరణలో గురువారం అమ్మ ఆంతరంగిక కార్యదర్శి కొండముది రామకృష్ణ సంస్మరణ సభలో ఆయన ముఖ్యఅతిధిగా పాల్గొన్నారు. అమ్మకు, భక్త జనులకు మధ్య వారధిగా నిలిచి కొండముది అందించిన సేవలు ఎనలేనివని శ్రీరామచంద్రమూర్తి పేర్కొన్నారు. మాతృశ్రీ మాసపత్రిక సంపాదకుడిగా ఆయన రెండు దశాబ్దాలపాటు అమ్మ సిద్ధాంతాలను బహుళ ప్రచారం చేశారన్నారు. ఈ సభకు అధ్యక్షత వహించిన మాతృశ్రీ అధ్యయన పరిషత్ అధ్యక్షులు ఎ.వి.వి. ప్రసాదరావు మాట్లాడుతూ అమ్మ ఆలయ ప్రవేశం చేసి విగ్రహరూపిణిగా దర్శనమిస్తూ, భౌతికంగా కనుమరుగైన క్లిష్ట దశలో కొండముది అచంచల విశ్వాసంతో భక్తులను ఉత్తేజపరచి సంస్థల పురోభివృద్ధికి కృషి చేశారన్నారు. సభలో శ్రీ విశ్వగురు పీఠాధిపతులు విశ్వయోగి విశ్వంజీ పంపిన ఆశీఃపూర్వక దివ్య సందేశాన్ని చదివి వినిపించారు.

శ్రీ విశ్వజననీ పరిషత్ మరియు మాతృశ్రీ విద్యాపరిషత్ వారు 3-9-1998న అనురాగ సదస్సు జరిపి ఈ 'అందరన్నయ్య'కు అశ్రుతర్పణ కావించారు. పలువురు ప్రముఖులు పలు రకాలుగా అన్నయ్య ఘనతను శ్లాఘించారు శ్రీ శ్రీ శ్రీ విశ్వ యోగి విశ్వంజీ అన్నయ్యను సంపూర్ణ పురుషుడిగా పర్ణించి అన్నయ్యకు మళ్ళీ జన్మలేదని ప్రకటించారు. పలువురు లేఖల ద్వారా సంతాపం ప్రకటించారు.

Rama Krishna was a creative thinker, writer and Philosopher. His devotion to mother, her ideals and values made him an institution attracting the attention of one and all concerned with the service to humanity.

- *Sri G.V.G. Krishna Murthy*

Election Commissioner of India

Ramakrishna Annaiah is one of those rare individuals who lived for his conviction till the last breath. Committed to the core and stone to actualise his committment till the last moment. Person of uncommon grit and rare courage

- Sri M. Dinakar
Manager
Indian Express

సత్వగుణానికి పరిపూర్ణ రూపం, పరమశాంత స్వభావం సృష్టిలోని మాతృత్వాన్ని తనలో నింపుకున్న అన్నయ్య అమ్మకు పెద్ద బిడ్డ ముద్దు బిడ్డ. అందరికీ తన ప్రేమామృతాన్ని పంచి ఇచ్చిన కర్మ యోగి అన్నయ్య.

- శ్రీమతి మోపిదేవి కళ్యాణి

అన్నయ్య అమ్మ ప్రతి కదలిక కు ఒక సజీవ భాష్యం. అమ్మ సిద్ధాంత ఆచరణకు ఒక సజీవ ఆకృతి. గొప్ప కార్యకర్తే కాదు గొప్ప కార్యకర్తలకు సృష్టి కర్త. అర్కపురిలో అవిశ్రాంతంగా సాగే జీవనది. వాడు చేస్తుంటే శివపూజ అని అనిపిస్తుందిరా ''అని అమ్మనే పరవశింప చేసిన ధన్యజీవి, మహాకవి''

''గడ్డి పరకలను సైతం బంగారు కణికలుగా తన మాటలతో చేతలతో మల్చగల మహాశిల్పి''

''ప్రతిక్షణాన్ని అమ్మకై అర్పించిన మహాతపస్వి''

''రూపుగట్టిన సమయస్ఫూర్తి''

''మానవతావాది - మానవతామూర్తి''

''సమాజంలో అమ్మను దర్శించిన మహనీయుడు''

''జిల్లెళ్ళమూడిలోనే తుది శ్వాసను వదులుతాను అనే మాటను చెల్లించుకున్న సిద్ధ సంకల్పుడు''

ముఖ్యంగా మా అధ్యాపక వర్గానికి ఒక వినూత్న స్ఫూర్తిని అందచేసిన మార్గదర్శి అన్నయ్య.

డాక్టరు - **ప్రొష్టి లక్ష్మీ కుమారశర్మ**

అన్నయ్య మన రామకృష్ణ అన్నయ్య మనకే కాదు ఎంత మందికో కొన్ని వేల లక్షల మందికి కూడా అన్నయ్యే. అమ్మ చల్లని చూపును దర్శన భాగ్యంగా పొందగలిగిన ప్రతి జీవికీ అన్నయ్యే....

మన అన్నయ్య భౌతికంగా మన మధ్యన లేడు అన్న ఆలోచనకి తావే లేదు. అన్నయ్య మనలోనే వున్నాడు. మనతోనే వున్నాడు. మన చుట్టూ మనల్నిచుట్టేసే వున్నాడు. తను నడిచిన బాటని మనకు చూపిస్తూవున్నాడు. తాను చేరిన గమ్యాన్ని మనకి తెలియ జేస్తున్నాడు.

జిల్లెళ్ళమూడిలో అడుగిడిగినప్పుడల్లా అమ్మని పూజించినపుడల్లా, అమ్మని ధ్యానించినపుడల్లా, అమ్మని స్మరించినపుడల్లా, అమ్మను గురించి సంభాషించుకు న్నప్పుడల్లా, అమ్మ చల్లని అనురాగపుద్భుక్కులను చిరునవ్వును, అమ్మ సందేశాన్ని, అమ్మ భావాలను, అమ్మ ప్రేమను అన్నీమనల్ని ముప్పిరుగొనేలా మన రామకృష్ణ అన్నయ్య తన రూపం ద్వారా, సందర్భోచితంగా మనతో వచించిన ప్రవచనల ద్వారా, ఘటనల ద్వారా, మనలో తనే నిండి పోయి మనకి వివరిస్తూ మనమే తనయిన వేళ రామకృష్ణ అన్నయ్య మన మధ్య భౌతికంగా లేడనే దానికి ఆస్కారం ఏది? లేదు. అన్నయ్య మనతోనే ఉన్నాడు, మనలోనే వున్నాడు మన హృదయ క్షేత్రాలలో అమ్మ అనురాగ, అనుగ్రహ భక్తి బీజాన్ని నాటి మనల్ని మనం తెలుసుకొనేలా మనం ఎలా నడుచుకోవాలో తెలియ జేస్తూ మన హృదయాలలో తన కంటూ ఓ ప్రత్యేక స్థానాన్ని పదిలపరుచుకొని తన జీవితాన్నే ఆదర్శంగా.... సన్మార్గంగా.... సందేశంగా.... మనల్ని గమ్యస్థానం వైపు, ముక్తి మార్గం వైపునడిపిస్తూ వున్నాడు. నడిపిస్తూ ఉంటాడు... మనలో నే ఉంటాడు. మనతోనే ఉంటాడు. అమ్మని స్మరించినపుడల్లా ముందుగా జ్ఞాపకాలపుటంలో మున్ముందుగా కన్పడేది మన రామకృష్ణ అన్నయ్య రూపమే... భావమే...... స్మరణమే.

అమ్మ కమనీయ పాదసేవలో నిరంతరం తన జీవితాన్నే అరగదీసి గంధంగా లేపనం చేసిన మన రామకృష్ణ అన్నయ్య.... స్వర్గంలో సైతం నిత్య సేవలో మమేకం జెందిన ముముక్షువు. అలాంటి పూజనీయుడు, గౌరవనీయుడు, నిత్యస్మరణీయుడు, మహానుభావుడు... అయిన మన రామకృష్ణ అన్నయ్యకివే........

నానమస్సుమాంజలులు,

నాస్కృత్యాంజలులు

జయహో మాతా శ్రీ అనసూయా

రాజరాజేశ్వరి శ్రీ పరాత్పరి

అమ్మా ... నీ దరిజేరి, నీచల్లని ఒడిలో

సేదదీరే మా రామకృష్ణన్నయ్య కివే


మా అందరి శతకోటి వందనాలు.... అమ్మా ..... అమ్మా....

- బాలకృష్ణ


హైదరాబాదు

ఇంత మంది హృదయాలలో విశిష్ట స్థానం పొందిన అన్నయ్యధన్యజీవి. ఆ అన్నయ్యతో సహజీవనం చేసిన, ఆ అన్నయ్యను ఆదర్శంగా చేసికొన్న మన అందరి జీవితాలు ధన్యమే. ''తృప్తేముక్తి'' అన్న అమ్మ వాక్యే వేదవాక్కుగా తృప్తిగా అమ్మను సేవించుకున్న అన్నయ్య జీవన్ముక్తుడు.

-) o (-



అర్చక స్థానంలో 'అన్నయ్య' ఉన్నందు వల్ల అంతర్ముఖి అయిన జగన్మాత. ప్రక్కన సోదరులు శ్రీ మోగులూరి సీతారామచంద్రరావు, శ్రీ యమ్. దినకర్



అమ్మ పూజామందిరంలో అన్నయ్య



తన వాక్చమత్కృతితో అమ్మను, సోదరుడు
బ్రహ్మాండం సుబ్బారావును అలరిస్తున్న అన్నయ్య



భక్తుడికి సహకరిస్తున్న అన్నయ్య



భగవంతునికి ఉపకరణంగా అన్నయ్య




అమ్మ విమానం దిగుతుంటె వెంట అన్నయ్య



అమ్మకు చేయూతనిస్తూ అమ్మను వాహనం నుండి దించుతున్న
అన్నయ్య - వెంట శ్రీ పొత్తూరి వెంకటేశ్వర రావు



ఆనాడు దండకారణ్యంలో రాముడి వెంట లక్ష్మన్న.
ఈనాడు జనార్ణవంలో అమ్మ వెంట రామకృష్ణ అన్న.



అమ్మ వాత్సల్య యాత్రలో అన్నయ్య
(1977 దివిసీమలో)




మేనల్లుడు లాలా, సోదరుడు కస్తూరి వెంకట రమణ మూర్తి
వెంటరాగా అమ్మకు రక్షణగా నిలబడ్డ అన్నయ్య



రాముడి పాదాల వద్ద హనుమంతునిలా
అమ్మ పాదాల వద్ద అన్నయ్య



లక్షమంది ఒకే పంక్తిలో భోజనం చేసిన అమ్మ స్వర్ణోత్సవం నాడు అమ్మ రథంలో అమ్మవెంట ఉండగల్గిన పుణ్యాత్ముడు మన అన్నయ్య. ప్రక్కన అంగరక్షకుడిగా మేనల్లుడు లక్కరాజు కృష్ణమోహన్



ఆనాడు పరమాత్మ పార్థసారథి అయితే
ఈనాడు రామకృష్ణ అన్నయ్య పరమాత్మ సారథి అయినాడు




అమ్మ అనంత యాత్రలో అన్నయ్య



'అమ్మ' ఆలయ ప్రవేశం చేస్తున్న సమయాన కర్తవ్యనిర్వహణలో అన్నయ్య



తొలినాటి ఆధ్యాత్మిక గురువు శ్రీ నూతల పాటి వీరయ్యా గారితో
అన్నయ్య (మధ్యలో ఉన్నవారు)



అమ్మ, శ్రీశ్రీశ్రీఅవధూతేంద్ర సరస్వతి స్వామీజీతో అన్నయ్య



అన్నయ్య సన్మాన సభలో అన్నయ్యను ఆశీర్వదిస్తున్న
శ్రీశ్రీశ్రీ లక్షణయతీంద్రులు. ప్రక్కన అన్నయ్య ధర్మపత్ని,
మేనల్లుడు లక్కరాజు పార్థసారథి



1998వ సం॥లో ప్రాణగండం నుండి బయటపడ్డ అన్నయ్యకు
ఆశీఃపూర్వక పరామర్శ అందిస్తున్న
శ్రీశ్రీశ్రీ విశ్వయోగి విశ్వంజీ మహరాజ్



రామకృష్ణ అన్నయ్య వ్రాసిన 'మాతృసంహిత' ప్రెస్‌కాపీ ఆవిష్కరిస్తున్న భారత ఎలక్షన్ కమీషనర్ శ్రీ జి. వి. జి. కృష్ణమూర్తి దంపతులతో అన్నయ్య. ప్రక్కన శ్రీ బూదరాజు శేషగిరిరావు దంపతులు మరియు బూదరాజు శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ



అనుంగు సోదరుడు శ్రీఏకా రాజేశ్వరరావు దంపతుల అభివందనలు స్వీకరిస్తున్న అన్నయ్య.




సోదరులు సింహరత్నం, శ్రీగోగినేని కనకయ్య, శ్రీ రావినూతల
రామచంద్రరావులతో అనుగ్రహ సదస్సులో అన్నయ్య




జగత్తునంతటా అమ్మను చూస్తు వినయంగా నమస్కరిస్తున్న
అన్నయ్య. ప్రక్కన శ్రీ కొండెపూడి సూర్యనారాయణ



శ్రీ విశ్వజననీ పరిషత్ కార్యకర్తలు, మాతృశ్రీ విద్యా పరిషత్
అధ్యాపకులు మరియు విద్యార్థిబృందం, సెక్రటరీ, కరెస్పాండెంట్,
శ్రీ తురుమెళ్ళ చెన్న కేశవరావుతో అన్నయ్య



''కొండముది రామకృష్ణ భవనములు'' అనిపేరు పెట్టబడ్డ
మాతృశ్రీ ఓరియంటల్ కళాశాల పాఠశాల భవనములు



కొండముది సోదరులు శ్రీ హనుమంతరావు, శ్రీ దత్తాత్రేయశర్మ (ఈగ్రంథ రచయిత), శ్రీ శ్రీ రామచంద్రమూర్తి, శ్రీ బాలగోపాల కృష్ణమూర్తిలతో అన్నయ్య



సోదరి శ్రీమతి అయ్యగారి కుసుమాచక్రవర్తి వ్రాసిన గ్రంధాన్ని ఆవిష్కరిస్తున్న అన్నయ్య. వేదికపై మాష్టర్ ఎ.వి.వి. ప్రసాదరావు, (విశాఖపట్టణం), సోదరులు పద్మనాభం (మద్రాసు) దంపతులు



బాల్య మిత్రుడు శ్రీ భట్టిప్రోలు చలపతిరావు కుటుంబ సభ్యులతో అన్నయ్య, అన్నయ్య కుటుంబ సభ్యులు



ధర్మపత్ని శ్రీమతి పద్మావతితో అన్నయ్య



తమనలుగురు పుత్రులు, పుత్రికతో
అన్నయ్య దంపతులు

మానవాళి వరం

మానవాళి వరమా మా నివాళి గొనుయా
అన్నా నీ కీ నివాళి అర్పించె నీ జనాళి ॥మానవాళి॥

మహస్సు బించించెనీ సదస్సూ
నభస్సు చుంబించె నీ సదస్సూ
ఫలించింది అన్నా నీ తపస్సూ
భ్రాతృశ్రీ నీకిది మా నమస్సూ ॥మానవాళి॥

ఒట్టి పోదు గిట్ట బోదు ఇలను జ్ఞాన తృష్ణ
పుట్టి గలడులే త్వరలో మరో రామకృష్ణ
అన్న కన్న మిన్న అని అతడు గాంచు ఖ్యాతి
అన్న ఈ నీ గీతి ఆలయాన జ్యోతి ॥మానవాళి॥

కొందముది రామకృష్ణ కాలిగోటిచెంత
కోహినూరు వజ్రమెంత? కోటితరాలెంత ?
అని అన్నది జనమంతా
వినమన్నది జగమంతా
విని జోహారన్నది విశ్వాంతరాళమంతా ॥మానవాళి ॥

వెతుక్కుంటూ అమ్మను వెళ్ళిపోయావా ?
వెక్కివెక్కి ఏడ్చినా వెనుకకు రావా ?
వేదనా బాటలో రోదన ఈ పాటా
వేగి పోయే ప్రతి హృదయం వేసింది బీటా ॥మానవాళి॥

సూర్య చంద్రులున్న వరకూ
సృష్టి ఉన్న వరకూ

21 అన్న - దానము

రచన : సదీరా

అన్న దానమెందుకురా
అని అనక ముందుకురా
దానగుణంలేని
జన్మ దండుగరా ॥ అన్నదాన॥

అన్నార్తులు తినినచో అన్నము
అది అమ్మకు గుడి కట్టినంత పుణ్యం !!
ఆమెతుకు మెతుకులో అమ్మ మెరిసి పోవులే
ఆమెరుపమ్మను కాంచి అన్న మురిసి పోవులే ॥అన్నదాన ॥

అన్నశ్వాసయై అమ్మ మిగిలి ఉన్నది
అన్న దీపమాయె అమ్మ చరణ సన్నిధి
అన్నమనకు అన్నమునకు రానీయడులోటు
''అన్న సుఖము కన్న'' సుఖము లేదని ఇక చాటు ॥అన్నదాన ॥

అమ్మ ధ్యానము అదే బ్రహ్మజ్ఞానము
మృత్యువుపై జయధ్వానం అన్న దానం.
అంతా అన్నాలు తిని అమ్మ త్రేన్పుగాకా
జగమంతా అన్నాలు తిని జనని త్రేన్పుగాకా
ఈ యాగం సాగుగాక
ఈ రాగం మ్రోగుగాక ॥అన్నదాన॥

(1997వ సం॥లో అన్నయ్య ప్రాణగండం నుండి బయలుపడ్డప్పుడు వ్రాసిన గీతం)

24 అన్నయ్య గురించి

రామకృష్ణ మూర్తి ఒక సమ్మోహన శక్తి

- శ్రీ తుమ్మల సీతారామ మూర్తి

సుకవి రామకృష్ణ ఒక రాజహంస - లేదా పరమ హంస,

కాదా రామకృష్ణ పరమహంస

-కరుణశ్రీ జంధ్యాల పాపయ్య శాస్త్రి

''వస్తువు మాయమై నీడుకు గాయమయిందట'' అన్న వాక్యం చాలు ఈ నూరేండ్ల ఆధునిక కవుల కన్నా అన్నయ్య గొప్పవాడు - అని చెప్పడానికి

- డాక్టర్ ముదిగొండ శివప్రసాద్

సమస్త సృష్టిలో అమ్మ పాదాలను చూడగల్గటం రామకృష్ణపూర్వజన్మసుకృతం లేదా 'అమ్మ' కరుణాపీయూషం

- ఆచార్య చేతవోలు రామబ్రహ్మం

అమ్మ వాత్సల్యగంగా తరంగాలలో మూడు దశాబ్దాలుగా మున్కలు వేసి దోసిళ్ళ కొద్దీ ఆమె దయామృతాన్ని పానం చేసిన వాడు రామకృష్ణ అన్నయ్య

- శ్రీ బాలాంత్రపు రజనీకాంతరావు

అమ్మ శ్రీరామచంద్రమూర్తి అయితే అన్నయ్య ఆంజనేయుడు. అమ్మ రామకృష్ణ పరమహంస అయితే అన్నయ్య వివేకానందుడు

- ప్రొఫెసర్ యల్. యస్. ఆర్. కృష్ణశాస్త్రి

అమ్మ మంచానికి అయిదో కోడు

-శ్రీపొత్తూరి వెంకటేశ్వర రావు



అమ్మలో ఐక్యమయిన అన్నయ్య అంతిమయాత్ర



'ఆత్మీయుడైన అన్నయ్య' ను కోల్పోయి రోదిస్తున్న సోదరి బండారు రాజరాజేశ్వరి దేవి (రాణి). ఓదారుస్తున్న అన్నయ్య కూతురు బూదరాజు సీతా మహాలక్ష్మి

అన్నయ్య గురించి.......

వాడు అప్పికట్లకు కరణం నాకు ఉపకరణం

- జిల్లెళ్ళమూడి అమ్మ

వాడికి చెబితే 'అమ్మ'కి చెప్పినట్లే.

వాడు వింటె 'అమ్మ' విన్నట్లే

- నాన్నగారు శ్రీబ్రహ్మాండం నాగేశ్వరరావు

రామకృష్ణ - పరమహంస

- శ్రీశ్రీశ్రీ అవధూతేంద్ర సరస్వతీ స్వామీజీ

రామకృష్ణ - కైంకర్యమణి

- శ్రీశ్రీశ్రీ కుర్తాళం సిద్ధేశ్వరీ పీఠాధిపతి

అమ్మ మహోన్నత హిమవత్ఛృంగం

ఆశృంగాన్ని సందిట పొదవుకున్న మంచు శ్రీరామకృష్ణ

- శ్రీశ్రీశ్రీ లక్ష్మణయతీంద్రులు

జిల్లెళ్ళమూడి అమ్మ తన ప్రతినిధిగా

ప్రతీకగా కొండముది రామకృష్ణను నిలిపింది

- శ్రీశ్రీశ్రీ విశ్వయోగి విశ్వంజీ మహరాజ్

అమ్మ రామకృష్ణను తన సింహాసనంగా స్వీకరించింది

తన సందేశాన్ని ఈ సింహాసనం నుండి వినిపిస్తున్నది

- మాష్టర్ మోపిదేవి కృష్ణ స్వామి